PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 26.04.2013, శుక్రవారం సంపుటి : 32 సంచిక : 47 పేజీలు : 12, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## పాదయాత్ర ముగిసింది

# పార్టీకేం ఒరిగింది?



- కేడర్‌లో ఉత్సాహం!
- లీడర్‌లో ఉత్తేజం!!
- ఓట్లు వస్తాయా?
- అధికారం వస్తుందా??

వస్తున్నా మీ కోసం... మీ ఓట్ల కోసం... మాకు అధికారం కోసం... మా పార్టీ మనుగడ కోసం... మా కేడర్‌ను కాపాడుకోవడం కోసం అంటూ చంద్రబాబు మొదలుపెట్టిన పాదయాత్ర ఈ నెల 27వ తేదీతో ముగిసింది. విశాఖలో ముగింపు సభను భారీగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుండి ముగింపుసభ కోసం 12రైళ్లను, 500 బస్సులను విశాఖకు ప్రత్యేకంగా నడిపారు. కొన్ని వేల సంఖ్యలో కార్లు వచ్చాయి. ముగింపుసభ సూపర్ సక్సెస్ అయ్యింది. ఇంతవరకు బాగానే వుంది. చంద్రబాబు పాదయాత్ర అనే ఆపరేషన్ సక్సెస్ అయ్యింది. ఇక పార్టీ అనబడే పేషంట్ పరిస్థితి ఎలా వుందనేదే చూడాలి.

అరవై మూడేళ్ల వయసులో చంద్రబాబు పాదయాత్ర చేపట్టడం సాహసమే అనుకోవాలి. అక్టోబర్ 2వ తేదీన అనంతపురం జిల్లాలో ఆయన యాత్ర మొదలుపెట్టాడు. మధ్యలో ఒకట్రెండు రోజులు వైద్యుల సలహాతో విశ్రాంతి తీసుకున్నాడు తప్ప మిగతా అన్నిరోజులూ నడిచాడు. పాదయాత్రలో శారీరకంగా ఎన్నో అవస్థలు పడ్డాడు. 7నెలల పాటు 2500కిలోమీటర్లు నడిచాడు. ఈ వయసులో కూడా ఇంత దూరం నడవడం ఒక రికార్డే!

ఈ వయసులో ఆరోగ్యరీత్యా రిస్క్ అని తెలిసినా కూడా ఆయన ఎందుకు ఇంత సుదీర్ఘ ప్రయాణం పెట్టుకున్నాడు? అనేదే (మిగతా 8వ పేజీలో)



## వైకాపాలో..

# పెరిగిన 'గిరి'

- సమర్ధతకే సత్కారం
- విధేయతకో నమస్కారం
- కాకాణికి ప్రమోషన్
- మేకపాటికి ఎమోషన్

"కాకాణి గోవర్ధన్‌రెడ్డి". ఈయన అందరివాడే కాని అందరిలాంటివాడు కాదని 'లాయర్' 7సంవత్సరాల క్రితమే చెప్పింది. ఆయన జడ్.పి. ఛైర్మెన్ బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే ఆయన పనితీరును గమనించి భవిష్యత్తులో ఆయన సమర్ధవంతుడైన నేతగా శక్తివంతమైన నాయకుడిగా ఎదుగుతాడని జోస్యం చెప్పింది "లాయర్". నేడు అదే నిజమయ్యింది. జిల్లాలో అత్యంత ప్రజాభిమానం కలిగిన ఏకైక నాయకుడిగా కాకాణి ఎదిగాడు. జిల్లా మొత్తం తనకంటూ ఓ వర్గాన్ని ఏర్పరచుకున్నాడు, తనదంటూ ఒక నాయకత్వపు వరవడిని సృష్టించుకున్నాడు.

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఏ పార్టీ జెండా లేకపోయినా తన స్వంత అజెండాతో గెలవగలిగిన ఒకే ఒక్క నాయకుడిగా ఆయనకు ప్రజాదరణ ఉంది. ఆయన సమర్ధతను, వ్యక్తిత్వాన్ని ప్రజలలో ఆయనకున్న గుర్తింపుని గమనించిన వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ సారధి జగన్‌మోహన్‌రెడ్డి కాకాణికి జిల్లా పార్టీ బాధ్యతలను అప్పజెప్పాడు. నాయకుడిగా పార్టీని నడపడానికి కావలసిన లక్షణాలు పుష్కలంగా వున్న "జగన్" జిల్లాల్లో సైతం తనకు సరిసమానంగా ప్రజామోదం వున్న వ్యక్తులకే పార్టీ పగ్గాలు అప్పజెప్పాడు. జిల్లా ప్రజలు, వై.యస్. అభిమానులు వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ శ్రేణుల్లు సైతం కాకాణి (మిగతా 5వ పేజీలో)




## జిల్లా కన్వీనర్‌గా

# మేరిగ మురళి



మేడ్ బై మేకపాటి

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కన్వీనర్‌గా వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన మేరిగ మురళీధర్‌ను నియమించారు. వైకాపాను స్థాపించాక కాకాణి గోవర్ధన్‌రెడ్డి మొదటి జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టారు. రెండేళ్లపాటు సమర్ధవంతంగా పనిచేసారు. అయితే పార్టీలో నెలకొన్న అంతర్గత రాజకీయాల వల్ల ఆయన ఇటీవలే కన్వీనర్ పదవికి రాజీనామా చేసారు. ఆయనకు వారసుడిగా మేకపాటి సోదరుల అనుచరుడైన మేరిగ మురళీధర్‌ను నియమించారు.

మేరిగ మురళీధర్ పేరు మోసిన రాజకీయనాయకుడు కాదు. ప్రజాబలం వున్న నాయకుడూ కాదు. ఆయనకు పదవి ఇప్పించిన మేకపాటి సోదరులకే అంత సీన్ లేదు. రాజకీయంగా అనుభవం వున్న వ్యక్తి కూడా కాదు. కాకపోతే చెడ్డపేరు లేదు. వివాదాలు లేవు. వెంకటగిరి నియోజకవర్గంలో వాళ్ళు నల్లపరెడ్ల అనుచరులుగా నడుచుకుంటూ వచ్చారు. 1995లో జడ్పీటీసీగా గెలుపొందారు. 2000లో రాపూరు రెండో సెగ్మెంట్ నుండి ఎంపీటీసీగా గెలిచారు. 2006 నుండి 2008వరకు (మిగతా 5వ పేజీలో)

PDF Compressor Free Version





# ఏసిబికి చిక్కిన కార్పొ 'రేటు' తిమింగలం

## నగరపాలక సిబ్బందిలో భయం... భయం...

**మన సమాజంలో జరిగే అవినీతి ఏనుగం తయితే... వెలుగుచూసేది ఎలుకంత. అయినా అప్పుడప్పుడు ఏసిబి వాళ్లు ఆ ఎలుకలనైనా పట్టుకుంటున్నారు కాబట్టి ప్రభుత్వ ఉద్యోగులలో అంతో ఇంతో భయం వుంటుంది. లేకుంటే దర్జాగా జేబుల్లోనే చేతులు పెట్టి లాక్కునే స్థాయికి వచ్చేవాళ్లు.**

నెల్లూరు కార్పొరేషన్‌లో అవినీతి కార్పొరేట్ స్థాయికి చేరిందనేది నగ్న సత్యం. నగరపాలక సంస్థ పరిధిలో ఒక్కో పనికి ఒక్కో రేటు. అనధికారికంగా ఎన్ని అంతస్థులైనా కట్టుకో... సదరు అధికారి చేతిలో ఆమ్యామ్యా పడితే చాలన్నట్లుగా కార్పొరేషన్‌లో వాతావరణం వుంది.

ఏడేళ్ల క్రితం పాత మున్సిపల్ కార్యాలయంలో అప్పటి కమీషనర్‌గా వున్న చార్లెస్ ఉమాపతి ఓ కాంట్రాక్టర్ నుండి 50వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఆనాటి ఏసిబి డిఎస్పీ వివిఎస్ఆర్ చౌదరి, సిఐ వి.వీరాంజనేయరెడ్డిలు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీని తర్వాత మున్సిపాల్టీ కార్పొరేషన్‌గా మారింది. హోదా పెరిగినట్లుగానే లంచాల రేటు పెరిగింది. వేలల్లో వున్న లంచాలు లక్షల్లోకి చేరాయి. నగరంలో రియల్‌బూమ్ వల్ల నిర్మాణాలు ఎక్కువయ్యాయి. అపార్ట్‌మెంట్ల నిర్మాణం విచ్చలవిడి అయ్యింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అపార్ట్‌మెంట్‌లు, కమర్షియల్ భవనాలను నిర్మిస్తే పెద్దగా గిట్టుబాటు కాదు. నిబంధనలను అతిక్రమించి కడితేనే నాలుగు రూపాయలొచ్చాయి. అంటే మూడంతస్థులకు అనుమతి తెచ్చుకోవడం, ఇంకో అంతస్థు అదనంగా తీసుకోవడం, అనుమతి లేకుండానే పెంట్ హౌస్ వేసుకుని అమ్ముకోవడం... ఇలాంటి అక్రమ నిర్మాణాలు నగరంలో సర్వసాధారణమయ్యాయి. ఇలాంటి అనుమతి లేని నిర్మాణాలు చేయాలంటే అధికారులకు లంచాలిచ్చుకుంటూ పోవాలి. ఇది కూడా నగరంలో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతూనే వుంది. నగరం నిండా నిబంధనలకు విరుద్ధంగా వున్న నిర్మాణాలే! వీటన్నింటిని పగలగొడితే నెల్లూరంతా నిర్మానుష్యంగా



మారుతుంది. అవినీతి సంగతి ఎలావున్నా నగరంలో బిల్డర్లు, నిర్మాణదారులకు నగరపాలకసంస్థ అధికారుల సహకారం బాగానే వుండింది. కాకపోతే వేదాయపాలెం ప్రాంతానికి బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్‌గా వున్న టి.మధుసూదన్‌రావు లంచాల పీడ పడలేక ఓ బిల్డర్ అతనిని ఏసిబికి పట్టించిన సంఘటన నగరపాలక సంస్థలో ఒక్కసారిగా అలజడి రేపింది. అవినీతి అధికారుల గుండెల్లో గుబులు పుట్టించింది.

వివరాల్లోకి వెళితే... మెట్టుకూరు సునీల్‌కుమార్‌రెడ్డి వేదాయపాలెంలోని వెంకయ్యస్వామి లేఅవుట్‌లో అపార్ట్‌మెంట్ కట్టాడు. టౌన్ ప్లానింగ్ నుండి మార్టిగేజ్ అనుమతి కూడా పొందారు. అయితే నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్‌లు వదల్లేదని, అయిదో అంత స్తులో పెంట్‌హౌస్ వేసారని బిల్డింగ్ ఇన్స్పెక్టర్ మధు, సునీల్‌ను ఇబ్బంది పెట్ట సాగాడు. 5లక్షల లంచం డిమాండ్ చేసి ఇవ్వకుంటే అపార్ట్‌మెంట్‌ను కూలగొడతా మని హెచ్చరించసాగాడు. బేరసారాల అనంతరం ఇద్దరి మధ్య 4.50 లక్షలకు బేరం కుదిరింది. మంగళవారం లోగా ఈ డబ్బు ఇవ్వకుంటే సిబ్బందితో వచ్చి అపార్ట్‌మెంట్‌ను పగలగొడతానని మధు బెదిరించాడు. దీంతో ఆవేదనకు లోనయిన సునీల్‌కుమార్‌రెడ్డి ఏసిబి డిఎస్పీ భాస్కర్‌రావును ఆశ్రయించి విషయమంతా చెప్పాడు. ఏసిబి డిఎస్పీ స్పందించి సునీల్‌కు ఏమి చేయాలో చెప్పాడు. వాళ్ళు చెప్పిన దానిప్రకారం సునీల్ సోమవారం రాత్రి 7గంటల ప్రాంతంలో కార్పొరేషన్ కార్యాలయంలో. మూడోఅంతస్తులోని టౌన్ ప్లానింగ్ విభాగానికి వెళ్లి మధును కలిసాడు. డబ్బు తీసుకొచ్చిన విషయం చెప్పాడు. మధు అక్కడేవున్న అటెండర్ శ్రీనివాసులురెడ్డిని పిలిచి ఆ 3లక్షల డబ్బును సంతపేట నాలుగుకాళ్ల మండపం సమీపంలో వున్న కుమార్ జ్యూవెలరీలో ఇచ్చి రమ్మన్నాడు. శ్రీనివాసులురెడ్డి ఆ డబ్బు తీసుకుని గది నుండి బయటకురాగానే అక్కడే పొంచివున్న ఏసిబి సిబ్బంది చుట్టు ముట్టారు. దీంతో భయపడిన శ్రీనివాసులు రెడ్డి పరుగెత్తగా, సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. అలాగే ఏసిబి అధికారులు మధుసూదన్‌రావును, అతని అసిస్టెంట్ బాబురావును అదుపులోకి తీసుకుని రసాయన పరీక్షలు, ఇతర శాఖాపర చర్యలన్నీ పూర్తి చేసారు. అలాగే ఏసిబి అధికారులు మధుసూదన్‌రావు ఇంటిలోనూ తనిఖీలు నిర్వహించి కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మధు తీసుకున్న లంచంలో ఎవరెవరికి వాటా వెళ్తుందనే దానిపై కూడా ఏసిబి అధికారులు ఆరాతీసారు. అరెస్ట్ చేసిన మధు, శ్రీనివాసులు, బాబాలను మంగళవారం ఏసిబి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

**నీతి:** వందగొడ్లను తిన్న రాబందయినా ఒక్క గాలివానకు చస్తుంది. లంచాలతో పీడించి ఎంతో మంది ఉసురుపోసుకున్న ఇలాంటి అవినీతిపరుల చరిత్ర ఒక్క ఏసిబి దాడితో అంతమవుతుంది.

---

గగ్గోలు పెడుతున్న ప్రయాణీకులు

బైపాస్ అంటే...

# మా పరిస్థితేంటి?




అది నాయుడు పేట బస్టాండ్... రాత్రి ఒకటిన్నర గంట సమయం. అప్పుడే తిరుపతి నుండి నెల్లూరు వెళ్లే బైపాస్‌రైడర్ బస్సు వచ్చి ఆగింది. రెండు చేతుల్లో రెండు బ్యాగులతో ఓ ప్రయాణీకుడు ఆత్రంగా వచ్చి బస్సెక్కబోయాడు. అంతలో డ్రైవర్... ఏ ఊరికని అడిగాడు. గూడూరుకని ఆ ప్రయాణీకుడు చెప్పాడు. ఇది బైపాస్‌రైడర్, గూడూరులో ఆగదు అని సమాధానం ఇచ్చాడు. గూడూరు బస్టాండ్‌లోకి వెళ్లకపోయినా సరే... బైపాస్‌లో దిగి ఏదో ఒక ఆటో పట్టుకుని పోతాను, బస్సెక్క నివ్వండి అని ఆ ప్రయాణీకుడు వేడుకున్నాడు... కుదరదు, గూడూరు టిక్కెట్లు తీసుకోవద్దని మా అధికారులు చెప్పారు. కాబట్టి మీరు ఎక్కడానికి కుదరదన్నాడు. అంతే ఆ ప్రయాణీకుడిలో సహనం నశించింది. చేతిలో వున్న రెండు బ్యాగులను విసురుగా కిందేసి... మీ డిఎం నెంబర్ చెప్పు... ఇప్పుడే ఫోన్‌చేసి అడుగుతాను... రెండుగంటల నుండి ఈ బస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్నాను. ఏ బస్సు వచ్చినా బైపాస్‌రైడర్ అంటారు. గూడూరులో ఆపనంటారు. మీ ఆర్టీసీ ఇందుకే చంకనాకిపోతుందంటూ... ఆవేశంగా మాట్లాడసాగాడు. అయినా ఆ డ్రైవర్ లెక్కపెట్టకుండా బస్సును స్టార్ట్‌చేసుకుని వెళ్ళిపోయాడు. ఇదీ... నాయుడుపేట బస్టాండ్‌లో చోటుచేసుకున్న సంఘటన.

అన్నీ బైపాస్‌రైడర్ బస్సులే కావడంతో ప్రయాణీకులు ఎంతగా ఇబ్బంది పడుతున్నారోననడానికి ఉదాహరణ. నెల్లూరుజిల్లాలో నెల్లూరు తర్వాత పెద్ద పట్టణం గూడూరు. చిల్లకూరు బైపాస్‌కు గూడూరు బస్టాండ్‌కు ఒకటిన్నర కిలోమీటరు దూరముంటుంది. తిరుపతి, చెన్నైలకు వెళ్లే బస్సులన్నీ గూడూరు మీదుగానే పోవాలి. విశాఖ మొదలుకొని ఈస్ట్, వెస్ట్, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని అన్ని డిపోల బస్సులు తిరుపతికి వస్తుంటాయి. ఇవన్నీ గతంలో గూడూరు బస్టాండ్‌లోకి వచ్చేవి. కాని ఇప్పుడు నాలుగులైన్ల రహదారి వచ్చాక గమ్యం చేరేసమయాన్ని తగ్గించుకుని గూడూరు బస్టాండ్‌కు ముఖం చాటేస్తున్నాయి. బయట జిల్లాల బస్సులంటే తీసేద్దాం. నెల్లూరుజిల్లాలో చాలా డిపోల బస్సులు గూడూరులోకి రాకుండానే బైపాస్‌లోనుండే వెళ్లిపోతున్నాయి. నెల్లూరు నుండి తిరుపతికి నడిచే బైపాస్‌రైడర్లలో అయితే గూడూరుకు టిక్కెట్ కూడా కొట్టడం లేదు. మా ఊరు బైపాస్‌కు దూరంగా వుండడమే మేం చేసుకున్న పాపమా అని ప్రయాణీకులు వాపోతున్నారు.

---

# గుండెను పదిలంగా వుంచుకోండి



సదస్సులో ప్రసంగిస్తున్న శ్రీనివాసరాజు

దేశంలో 50శాతం మంది గుండె జబ్బులతో ఆసుపత్రులకు రాకమునుపే మృతి చెందుతున్నారని ప్రముఖ గుండెవ్యాధి నిపుణులు డా॥సి.ఎన్.శ్రీనివాసరాజు అన్నారు. నెల్లూరుజిల్లా పొదలకూరు మహాత్మాగాంధీ వాకర్స్ అసోసియేషన్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం బొగోలు కృష్ణారెడ్డి కల్యాణ మండపంలో గుండెజబ్బులపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డా॥శ్రీనివాసరాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రపంచవ్యాప్తంగా గుండె జబ్బులతో ఎక్కువమంది మరణిస్తున్నారన్నారు. ప్రపంచంలో షుగర్ వ్యాధిగ్రస్తుల్లో భారత్ ప్రథమస్థానం, చైనా ద్వితీయ స్థానంలో ఉందన్నారు.

వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు సుధాకరరాజు, కార్యదర్శి జాషువాలు మాట్లాడారు.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
• సరికొత్త,ప్రపంచస్థాయి మోడల్స్
• ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.

# గురువుకు కాకాణి సత్కారం



పొదలకూరు మండలం బిరదవోలు చెర్లోపల్లి గ్రామంలో ఆ గ్రామ పాఠశాల పూర్వవిద్యార్థులంతా కలసి తమ గురువర్యులు కొట్టిశ నరసింహారావుకు ఇటీవల సన్మానకార్యక్రమం ఏర్పాటుచేసి ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా కేంద్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కూడా పాల్గొని తన గురువును భక్తితో సన్మానించుకున్నారు.



# నెల్లూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా శ్రీనివాస్

నెల్లూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. గుంటూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయనకు ఇటీవలే సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పించి నెల్లూరుకు బదిలీ చేసారు. 6నెలల క్రితం నరసింహులు ఉద్యోగ విరమణ చేసినప్పటినుండి ఈ పోస్టు ఖాళీగావుంది. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తూవచ్చారు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాస్‌కు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



# రంగంలోకి రాం'కుమారుడు'

- తండ్రి వారసత్వాన్ని కాపాడుతాడా?
- నేదురుమల్లి వర్గ ఉనికిని నిలబెడతాడా?



*నెల్లూరుజిల్లాలోనే కాదు, ఈ రాష్ట్రంలోనే రాజకీయ విద్యలో పేరు గాంచిన నాయకుడు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి. రాజకీయనాయకుడంటే ఎలా వుండాలి, రాజకీయమంటే ఎలా చేయాలి, ప్రత్యర్థులను ఎలా చిత్తుచేయాలి, ఎవరిని ఎక్కడపెట్టాలి... వంటి విషయాలు నేదురుమల్లికి తెలిసినంతగా ఇంకెవరికీ తెలియవేమో!*

నెల్లూరుజిల్లాలోనే కాదు, రాష్ట్రంలోనే చాలామందిని రాజకీయాలలోకి తెచ్చిన అపరచాణక్యుడాయన. ఈ కాలంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌ల స్థాయి నాయకులు సైతం తమ పుత్రరత్నాలను వారసులుగా పేర్కొంటున్నారు. వారి వారసత్వాన్ని ఘనంగా ప్రకటించుకుంటున్నారు. కాని నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఎందుకోగాని... ఈ ఒక్క విషయంలో ముందుండలేకపోయాడు. ఎమ్మెల్సీ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఆయన రాజకీయ ప్రస్థానం సాగినా, తన బాటలో తన కొడుకులను నడిపించలేకపోయాడు. నేదురుమల్లికి నలుగురు కొడుకులున్నా ఇప్పుడు రాజకీయంగా అంతో ఇంతో అందుబాటులో వున్నది రాంకుమార్‌రెడ్డే! నేదురుమల్లి రాజకీయాలలో మంచి వూపుమీద వున్నప్పుడే రాంకుమార్‌రెడ్డి రాజకీయారంగేట్రం జరిగివుంటే ఈ జిల్లాలో నేదురుమల్లి వర్గం పరిస్థితి కొంచెం మెరుగ్గా వుండేదేమో! కాని చాలా ఆలస్యంగా రాంకుమార్‌ను రాజకీయాలలోకి తెచ్చారు. అదికూడా ఇంతవరకు ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాలేదు. కాకపోతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల నుండి ఆ ముచ్చట తీరే అవకాశముంది. నేదురుమల్లి కుటుంబీకులు గెలిచినా, ఓడినా వెంకటగిరి నియోజకవర్గాన్ని వీడలేదు. కాబట్టి ఆ ప్రాంతంలో తమ వర్గాన్ని అలాగే పట్టుకొస్తున్నారు. నేదురుమల్లి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టింది ఇక్కడే! వెంకటగిరి ఎమ్మెల్యేగా వుంటూనే 1992-93లలో ముఖ్యమంత్రిగా పనిచేసారు. 1999లో నేదురుమల్లి రాజ్యలక్ష్మి కూడా రాజకీయ అరంగేట్రం చేసిందిక్కడే! 1999, 2004లలో గెలిచిన ఆమె 2009లో ఓడిపోయింది. జిల్లాలో నేదురుమల్లి వర్గం బాగా బలహీనపడింది. ఆనం వర్గందే ఇప్పుడు జిల్లా కాంగ్రెస్ పెత్తనం. తమ వర్గాన్ని కాపాడుకునే ప్రయత్నంలో నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ప్రత్యక్ష రాజకీయ కార్యాచరణకు పూనుకుంటున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో నేదురుమల్లి రాజకీయ వారసుడిగా పోటీ చేసేందుకు రాంకుమార్‌రెడ్డి పావులు కదుపుతున్నారు. ఈ రాంకుమారుడు తన తండ్రి రాజకీయ వారసత్వాన్ని ఎంతవరకు నిలబెడతాడో, తన వర్గాన్ని ఎంతవరకు కాపాడగలడో చూద్దాం!

# కలెక్టర్‌గా రెండేళ్ళు

## ■ పనితీరులో దాటాడు ఎన్నో మైలురాళ్ళు



*కొన్నేళ్లుగా అవినీతిపరులను జిల్లా పరిపాలనాధికారులుగా చూసిన ప్రజలు రెండేళ్ల నుండి మాత్రం ఓ నిజాయితీపరుడిని చూస్తున్నారు. ఇటీవల కాలంలో నెల్లూరుజిల్లా కలెక్టర్లుగా పనిచేసినవాళ్లు పరిపాలనా వ్యవస్థను గబ్బు పట్టించారు. పైరవీలకు పోటీచ్చారు. దళారులను నెత్తికెక్కించారు. రాయలేని రీతిలో కలెక్టర్ బంగ్లాను బూతుబంగ్లాగా మార్చారు.*

*బి.శ్రీధర్ ఈ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయ్యింది. గత కలెక్టర్లలో ఎక్కువశాతం మంది వివిధ రాజకీయపార్టీల నాయకుల చేత నానామాటలు అడిగించుకుని వివాదాలతో బదిలీ అయినవాళ్లే! కలెక్టర్లకు వ్యతిరేకంగా నెల్లూరులో ఉద్యమాలు కూడా జరిగాయి. అంతగా విమర్శల పాలయ్యారు గతంలో కొందరు కలెక్టర్లు.*

శ్రీధర్ వచ్చి రెండేళ్లయినా ఒక్క ఆరోపణ లేదు. ఏ ఒక్క రాజకీయనాయకుడు వేలెత్తి చూపే పరిస్థితి లేదు. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ముక్కుసూటితనంగా పనిచేసుకుపోతున్నాడు. అలాగని ప్రజాప్రతినిధులతో ఆయనకు విభేదాలు లేవు. ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డితో సమన్వయంగా వుంటూ ఆయన సహకారంతో జిల్లాలో అభివృద్ధిపనులకు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలో విద్య, వైద్య సౌకర్యాల మెరుగు కోసం తాపత్రయపడుతున్నారు. 'సరస్వతినిధి' ద్వారా పేదవిద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ విద్యను అందించడానికి కృషి చేస్తున్నారు. ప్రభుత్వ వసతిగృహాల రూపురేఖలను మారుస్తూ, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నారు. సర్కార్ దవాఖానాల ద్వారా ప్రజలకు మంచి వైద్యం అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఆయన హయాంలో జిల్లా రైతాంగానికి సైతం ఎంతో మేలు జరిగింది. జిల్లాలోని ప్రధాన రిజర్వాయర్‌లలో నీళ్లు తక్కువగా వున్నా, ఎక్కువసాగుకు అవకాశం కల్పించారు. ప్రభుత్వం ద్వారానే జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను (మిగతా 5వ పేజీలో)


# బోటు ఆగిందా... బువ్వ గోవిందా!



ఆగిన తెప్పలు... పూటకు తిప్పలు

*రైతులకు క్రాప్‌హాలిడే, పరిశ్రమలకు పవర్ హాలిడే అన్నట్లుగా సముద్రంలో చేపలు పట్టుకుని జీవించే మత్స్యకారులకు కూడా హంటింగ్ హాలిడేస్ వుంటాయి. హాలిడే అంటే విద్యార్థులకు, ఉద్యోగులకు సరదాగా వుంటుంది గాని, మత్స్యకారులకు మాత్రం అది బ్లాక్‌డేగా మారుతుంది. ప్రతి పూటను పస్తులతో వెళ్లదీయాల్సివస్తుంది. తెప్ప నడవనిదే, తెడ్డు తిప్పనిదే పూటగడవని కుటుంబాలకు ఈ హంటింగ్ హాలిడే సమస్యలనే మిగిలిస్తుంది.*

దక్షిణాన నెల్లూరుజిల్లాను మొదలుకొని ఉత్తరాన శ్రీకాకుళం వరకు మన రాష్ట్రంలోని 9 కోస్తా జిల్లాలలో 974కిలోమీటర్ల మేర సముద్రతీరప్రాంతం వుంది. సముద్రంలో చేపలు గుడ్లుపెట్టే సీజన్‌లో ఈ జిల్లాల్లోని తీరప్రాంతాలలో సముద్రంలో వేటను నిషేధిస్తారు. మన నెల్లూరుజిల్లాలో చూస్తే 170కిలోమీటర్ల మేర సముద్రతీర ప్రాంతం వుంది. జిల్లా లోని 12తీర మండలాల్లో 126గ్రాముల పరిధిలో లక్షాపాతిక వేల మంది మత్స్యకారులు సముద్రంలో చేపలవేటనే బ్రతుకు మార్గంగా ఎంచుకున్నారు. వీరికి వేటకు పోతేనే ఇంట్లో పొయ్యి వెలుగుతుంది. ఈ నెల 15 నుండి మే నెలాఖరువరకు సము ద్రంలో చేపలవేటను నిషేధించారు. చేపలవేటపై నిషేధం సమయంలో ప్రభుత్వపరంగా మత్స్యకారులకు బియ్యం, జీవనభృతి ఇవ్వాలి. కాని అవి సక్రమంగా అందడంలేదని మత్స్యకారులు వాపోతున్నారు.




## చెట్లను పెంచాలి

ప్రతిఒక్కరూ తమ బర్త్‌డే వేడుకలను సమాజసేవా కార్యక్రమాలతో జరుపుకోవాలి. బర్త్‌డేలను మద్యం, కేక్‌లు, ఆహార పదార్థాలతో జరుపుకునే బదులు బర్త్‌డేరోజు 10 మొక్కలు నాటాలి. వాటిని రోజూ సంరక్షించాలి. తద్వారా భావితరాలకు పచ్చదనాన్ని అందించడమే కాదు, వాతావరణ కాలుష్యాన్ని సైతం నివారించిన వారిమవుతాము.

నల్లావుల భాస్కర్‌రెడ్డి,
కోవూరు.

## రాజకీయ శ్మశానం

అవినీతి రహితుడైన ఆనం రామనారాయణరెడ్డిగారు మనకు ఆర్థికశాఖామాత్యులుగా ఉండటం మన అదృష్టం. గర్వకారణం. జగన్మోహన్‌రెడ్డిని ఉరితీయాలని, వైయస్ ఆర్ కుటుంబాన్ని వెలివేయాలని ఆయన అనడం ఆయనకు అవినీతి అంటే ఎంత అసహ్యమో మనం అర్థం చేసుకోగలం. అయితే జగన్ విషయం కోర్టు పరిధిలో ఉంది. చట్టం తన పని తాను చేసుకొని పోతూ వుంది. జగన్ దోషి అని కాని, నిర్దోషి అని కానీ, ఆయన ఆస్తులు సక్రమమైనవా, అక్రమమైనవా అని నిర్ధారణ కాలేదు. ధారావాహిక మెగాసీరియల్ లాంటి 'ఛీ!బీఐ' దర్యాప్తు నత్త నడకను తలదన్నేలా కొనసాగుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని ఉరితీస్తూ, వాళ్ళ కుటుంబాలను వెలివేస్తూ పోతే, అటు కేంద్రంలో కానీ, ఇటు రాష్ట్రంలో కానీ ఒక్క రాజకీయనాయకుడు మిగలడు. అప్పుడు రాజకీయశ్మశానం ఏర్పడుతుంది.

కురుగూరు రంగనాథం,
నెల్లూరు.

## సోలార్‌విద్యుత్‌పై అవగాహన

సూర్యశక్తిని మించిన శక్తి ఈ విశ్వంలో ఏదీ లేదు. కొన్ని కోటాను కోట్ల మెగావాట్ల విద్యుత్ సూర్యుని నుండే ఉత్పత్తి అవుతుంది. అది ఫ్రీకరెంట్. ఆ విద్యుత్‌ను మనం వాడుకుందాం. ఇళ్లు, పరిశ్రమలు వ్యాపార, వాణిజ్య సంస్థల వాళ్లు సోలార్ ప్యానెల్స్‌ను అమర్చుకుని సొంతంగా సౌరవిద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోగలిగితే విద్యుత్ కొరత తీరుతుంది.

సి. రాంజీ, హైదరాబాద్.

## 'ప్రభా'తం

రామాయణంలో రావణాసురుడు ఒకడే కనిపిస్తాడు. భారతంలో కీచకుడు కూడా ఒక్కడే వుంటాడు. కాని కొన్ని లక్షల సంవత్సరాల క్రితం వాళ్లు చేసిన పాపాలకు ఈరోజుకీ వారిని విలన్‌లుగా చూస్తున్నాం. నేటి సమాజంలో తప్పుచేసిన వారిని రావణుడు, కీచకుడు, నరకాసురుడు, కంసుడు వంటి వారితో పోలుస్తున్నాం. ఒకసారి మనమే ఆత్మపరిశీలన చేసుకుందాం... ఐదేళ్ల చిన్నారిపై అత్యంత పాశవికంగా, నీచాతినీచంగా, క్రూరంగా, అతి దారుణంగా అత్యాచారానికి ఒడిగట్టిన నిందితులను తమతో పోలిస్తే... అది పైలోకాలలో వున్న రావణుడికో, కీచకుడికో తెలిస్తే... వాళ్లేం చేస్తారు... తూ... ఇలాంటి నీచులతో మమ్మల్ని పోలుస్తారా... మా బ్రతుకులు ఇలా తగలబడ్డాయా అనుకుంటూ వెంటనే దగ్గర్లో వున్న చెట్టుకు ఉరేసుకుంటారు. సైనేడ్, విషం లాంటివి అందుబాటులో వుంటే అవి తాగి చస్తారు. ఎందుకంటే వాళ్లు విలన్‌లు అయినా వారి విలనిజంలోనూ నిజాయితీ వుంది. రావణుడు సీతమ్మను అపహరించుకు వెళ్ళి శ్రీలంకలో దాచాడేగాని ఎటువంటి అఘాయిత్యాలకు పాల్పడలేదు. కీచకుడు ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారానికి ఒడిగట్టలేదు. రామాయణం, మహాభారతంలో పరమ దుర్మార్గులుగా చిత్రీకరించబడ్డ రాక్షసులు బస్సులో ఒక అభాగ్యురాలి మానప్రాణాలతో ఆడుకోలేదు. మాటలలో చెప్పలేని, చేతులతో వ్రాయలేనంత క్రూరంగా హింసించలేదు. కాబట్టి నేటి సమాజంలో వెలుగులోకి వస్తున్న విలన్‌లను నాటి రావణుడు, కీచకుడు వంటివారితో పోల్చడం తగదు.

### కీచక భారతం



పవిత్ర భారతదేశంలో ఆడబిడ్డగా పుట్టడమే స్త్రీజాతికి శాపంగా మారుతుంది. ఓ పక్క మహిళలపై నేరాలకు పాల్పడేవారి కోసం 'నిర్భయ' కఠిన చట్టాన్ని తెచ్చారు. కాని ఇంకో పక్క మహిళలపై దారుణాలు ఆగడం లేదు. చట్టాలతో, ఆందోళనలతో ఈ కీచకపర్వాలను అడ్డుకోవడం సాధ్యమేనా?

మనది వేదభూమి, పుణ్యభూమి, స్త్రీని దేవతగా ఆరాధించే భూమి. ఈ దేశంలోని ప్రతి గ్రామంలో బడి వుండకపోవచ్చుగాని గ్రామదేవత గుడి లేకుండా వుండదు. ఇక్కడ స్త్రీని శక్తిస్వరూపిణిగా కొలుస్తారు. మరి ఇలాంటి ఈ పుణ్యభూమిలో మహిళలపై ఈ అఘాయిత్యాలేంటి? ఈ ఘోర కిరాతకాలేంటి? బయట మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను చూస్తుంటే తల్లుల కడుపులో వున్న ఆడశిశువులు సైతం తల్లిగర్భం నుండి బయటకు రావడానికి భయపడే పరిస్థితి వచ్చింది.

మహిళాముఖ్యమంత్రి పాలనలో వున్న దేశ రాజధాని ఢిల్లీ నగరంలో మహిళలపై జరుగుతున్న దారుణాలకు ఒక హద్దులేకుండా పోయింది. ఇటీవల ఒక ప్రైవేటు బస్సులో జరిగిన 'నిర్భయ' అత్యాచార ఉదంతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ప్రపంచంలో అన్ని దేశాల వారిచేత కంటతడి పెట్టించింది. మాటలకందని దుర్మార్గం అది. ఈ కేసులో ప్రధాన నిందితుడు రాంసింగ్ తీహార్ జైల్లోనే ఉరేసుకుని చావడం కూడా తెలిసిందే! 'నిర్భయ' సంఘటనతో దేశంలో పెద్దఎత్తునే ఆందోళనలు చెలరేగాయి. దిగొచ్చిన కేంద్రప్రభుత్వం మహిళల భద్రతకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడేవారికి కఠినశిక్షలు విధించేలా ఈ చట్టాన్ని రూపొందించారు.

ఈ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించి కొద్దిరోజులే అయ్యింది. అయినా దేశంలో అత్యాచారాలు ఆగాయా? మహిళలపై వేధింపుల పర్వం ఆగిందా? చట్టాల గురించి నేరాలకు పాల్పడేవారికి తెలియదా? అత్యాచారాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడతాయనే విషయం తెలిసినా పదేపదే ఇవే నేరాలు ఎందుకు జరుగుతున్నాయి? ఢిల్లీలో అభం శుభం తెలియని ఐదేళ్ళ చిన్నారిని అక్రమంగా నిర్బంధించి ఇద్దరు దుర్మార్గులు అత్యాచారానికి ఒడిగట్టిన సంఘటన ఇప్పుడు దేశంలో మరో సంచలనమైంది. మరి ఇలాంటి దారుణాలకు కారణమేంటి? కఠినచట్టాలు తెచ్చినా, కఠినశిక్షలు అమలుచేసినా ఈ నేరాలు ఇక్కడితో ఆగుతాయా?

సృష్టిపరంగా మనిషిలో కొన్ని లక్షణాలు వుంటాయి. ఆకలి వేస్తే కడుపుకు తిండి కావాలి. తిండి దొరక్కపోతే ఒకపూట, లేదంటే ఒకరోజు ఆకలి భరిస్తాడు. కాని రెండోరోజు కూడా తిండి తినకుండా వుండలేడు. అలాగే నిద్ర... ఏ మనిషయినా ఒకరోజు మేల్కోగలడు. మహా అంటే రెండోరోజూ మేల్కోగలడు. అంతే గాని మూడోరోజు నిద్రపోకుండా వుండలేడు. మనిషి శరీర నిర్మాణంలోనే ఈ లక్షణాలున్నాయి. అలాగే ఒక వయసు వచ్చాక శృంగారం అనేది సర్వ సాధారణం. మనది సంస్కృతి, సంప్రదాయాలతో ముడిపడిన దేశం కాబట్టి విచ్చలవిడి శృంగారంపై పరిమితులు న్నాయి. శృంగారం మన దేశంలో డిమాండ్ వస్తువు అయిపోయింది. శృంగారం భార్యాభర్తల మధ్యనే వుండాలన్నట్లుగా రాజముద్ర పడిపోయింది. మరి భార్యలు లేని వాళ్లు, భర్తలను కోల్పోయిన వాళ్లు, లేదా వదిలేయబడ్డ వాళ్ళు... ఇలా ఎందరో! మరి వీళ్లందరికీ శృంగారపరమైన కోరికలు వుండవా? ఇవి అణచుకోలేరు. సృష్టిపరంగానే మనిషిలో ఆ జీన్స్ వున్నాయి. వీటిని అదుపు చేసుకోలేనప్పుడే మనిషి కట్టు తప్పుతుంటాడు.

మన పూర్వీకులు అమాయకులు కాదు. మనిషి పశువుగా మారి కామవాంఛతో ఇంకొకరిపై పడకుండా చేసేందుకు ఆ కాలంలోనే వేశ్యావాటికలను ఏర్పాటు చేశారు. ఆరోజుల్లో ఈనాటి కాలంలోలాగా అత్యాచారాలు లేవే! అంతెందుకు శృంగార జీవనంపై పరిమితులు లేని అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, థాయ్‌లాండ్... ఇంకా ఎన్నో ప్రపంచ దేశాలలో మహిళలపై అత్యాచారాలు చాలాతక్కువ. ఎందుకంటే అక్కడ పరస్పర అవగాహన, ఒప్పందంతో నెరిపే శృంగారం నేరం కాదు. కాని మన దేశంలో శృంగారంపై వున్న ఆంక్షల మూలంగానే కామవాంఛ ముదిరినవాళ్లు పశువుల్లా మారి తమ కోరికలను తీర్చుకోవడానికి చిన్నారుల జీవితాలపై సైతం విషం చిమ్ముతున్నారు. కాలానికనుగుణంగా మన వ్యవస్థ మారాలి. చట్టాలను మార్చుకోవాలి. మార్పుని మనమే తెచ్చుకోవాలి...!

## 'అంతర్'జాతీయం

- చైనాలోని సిచులాన్ ప్రావిన్స్ ప్రాంతంలో 20వ తేదీ భారీ భూకంపం సంభవించింది. ఈ భూకంపంలో 207మంది ప్రాణాలు కోల్పోగా 11500మంది గాయపడ్డారు. పదివేలకుపైగా ఇళ్ళు నేలమట్టమయ్యాయి. రిక్టర్‌స్కేలుపై 7.0గా దీని తీవ్రత నమోదైంది.
- పాకిస్థాన్ మాజీఅధ్యక్షుడు ముషారఫ్‌కు ఉగ్రవాద వ్యతిరేక కోర్టు 20వ తేదీన 14రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కోర్టు ఆయన ఫామ్‌హౌస్‌నే సబ్‌జైలుగా ప్రకటించడంతో ఆయన అక్కడే గడుపుతున్నాడు. 2007లో తన హయాంలో ఎమర్జన్సీ ప్రకటించిన తర్వాత ఏకంగా 60మంది న్యాయమూర్తులను నిర్బంధించినందుకు దేశద్రోహం అభియోగాల మీద ఆయన విచారణ ఎదుర్కొంటున్నారు.
- అమెరికాకు వచ్చే భారతీయ సాంకేతిక నిపుణుల హెచ్1-బీ వీసాల రుసుం పెంపు ప్రతిపాదన వివక్షపూరితంగా వుందని కేంద్ర ఆర్థికశాఖమంత్రి పి. చిదంబరం ఆందోళన వ్యక్తంచేసారు. ఐటీ నిపుణులను వలసదారులుగా చూడొద్దని ఆయన అమెరికా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.
- అతిక్లిష్టమైన లెక్కలను అలవోకగా చెబుతూ మానవ కంప్యూటర్‌గా పేరుతెచ్చుకున్న గణితమేధావి శకుంతలాదేవి(80) ఆదివారం బెంగుళూరులో కన్ను మూసారు. చిన్నవయసు నుండే ఆమె గణితంలో విశేష ప్రతిభ చూపారు. గణితంలో ఏ సమస్యకైనా క్షణంలో సమాధానం చెప్పేవారు.
- సభా కార్యక్రమాలను అడ్డుకునే సభ్యుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ హెచ్చరించారు.
- మలివిడత బడ్జెట్ సమావేశాలలో కీలకమైన బిల్లులు ఆమోదం పొందాల్సి వున్నందున పార్లమెంట్‌ను సజావుగా సాగనివ్వాలని విపక్షాలకు ప్రధాని మన్మోహన్‌సింగ్ విజ్ఞప్తి చేసారు. ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్న వివిధ అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు.
- బోఫోర్స్ కేసు ఇక ముగిసిన అధ్యాయమే. కేసు నమోదుచేసి 20ఏళ్లు గడిచినా కూడా నిందితుడు ఖత్రోచిని దేశంలోకి రప్పించలేకపోయినందువల్ల ఈ కేసు నుండి ఆయన విముక్తుడైనట్లేనని రక్షణశాఖ మంత్రి ఏ.కె.ఆంటోని లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.
- బంగ్లాదేశ్ సీనియర్‌నేత పార్లమెంట్ స్పీకర్ అబ్దుల్ హమీద్(69) ఆ దేశ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధికార అవామీలీగ్ పార్టీ ఆయనను నామినేట్ చేసింది.

## వార్త వ్యాఖ్య

వార్త :- నెలరోజులుగా ఫైళ్లు చూడని సీఎం.
వ్యాఖ్య :- **ఫైళ్లు అంటేనే ఆయనకు వికారం లాగుంది.**
వార్త :- టీఆర్ఎస్ ఫామ్‌హౌస్ పార్టీ. - చంద్రబాబు.
వ్యాఖ్య :- **ఎంతోనయం... మందుపార్టీ అనలేదు.**
వార్త :- నీది కూరగాయల పార్టీయా? - చంద్రబాబుపై కేసీఆర్ ధ్వజం.
వ్యాఖ్య :- **చివరకు ఆ పరిస్థితే వచ్చేటట్లుంది?**
వార్త :- మోడీ లౌకికవాది. - రాజ్‌నాథ్‌సింగ్.
వ్యాఖ్య :- **దేశంలో ఇక మతోన్మాదులెవరు?**
వార్త :- హిట్లర్, బాబుల పుట్టినరోజు ఒక్కటే. - షర్మిల.
వ్యాఖ్య :- **అక్టోబర్ 2న పుట్టిన వాళ్లంతా గాంధీలు కాదు కదమ్మా!**
వార్త :- పేదలపై విద్యుత్ భారం లేదు. - సీఎం.
వ్యాఖ్య :- **పేదలెక్కడున్నారు... వారినీ ధనికుల్లో కలిపేసారుగా!**
వార్త :- అన్నీ ప్రధానికి చెప్పే చేశా. - జేపీసీకి రాజా లిఖితవాంగ్మూలం
వ్యాఖ్య :- **కాకపోతే ఆయన విని వుండడు.**
వార్త :- సీఎం కిరణ్ దళితద్రోహి. - చంద్రబాబు.
వ్యాఖ్య :- **మిగతావాళ్లకు ద్రోహం చేయనట్లేనా?**
వార్త :- త్వరలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి. - మోహన్‌బాబు.
వ్యాఖ్య :- **ఏ పార్టీలో గొడవలు తెస్తారో...**
వార్త :- పోలీసుల పనితీరుపై దర్యాప్తు చేస్తాం. - కేంద్ర హోంమంత్రి షిండే.
వ్యాఖ్య :- **అంతకంటే ముందు మీ ప్రభుత్వాల పనితీరుపై దర్యాప్తు చేయండి.**
వార్త :- లావాదేవీలలో వాద్రాకు క్లీన్‌చిట్.
వ్యాఖ్య :- **క్లీన్‌చిట్ ఇచ్చేవాళ్లు మనవాళ్లయినప్పుడు దిగులెందుకు.**
వార్త :- అందరికీ ఉచిత మందులు. - కేంద్రమంత్రి ఆజాద్.
వ్యాఖ్య :- **ఉచిత మందులకంటే 'ఉచిత మందు' పెడితే సక్సెస్ అవుతుందేమో!**
వార్త :- ఓటును తప్పనిసరి చేయాలి. - బీజేపీ నేత వెంకయ్యనాయుడు.
వ్యాఖ్య :- **అలాగే ఓటుకు నోటును కూడా...**

# పెరిగిన 'గిరి'

(మొదటిపేజీ తరువాయి)

నాయకత్వాన్ని బలపరచారు. ఒక్క మేకపాటి కుటుంబీకులకే "కాకాణి" నాయకత్వం నచ్చలేదు. ఎందుకంటే వాళ్ళు ప్రజానాయకులుగా ప్రజల అండదండలతో ఎదిగిన వ్యక్తులు కాదు. కేవలం తమ వ్యక్తిగత ఆధిపత్యంతో ధనహంకారంతో అదృష్టం కలిసొచ్చి నాయకులుగా ఎదిగారు తప్ప, జిల్లా స్థాయిలో పార్టీని ముందుకు నడిపించి జిల్లా అంతటా తమ వర్గాన్ని సమర్ధవంతంగా ఏర్పాటు చేసుకోగల సత్తా వారికిలేదు. వాళ్లు అంతటి మేధావులు కూడా కాదు. వై.యస్. రాజశేఖరరెడ్డి కుమారుడిగా "జగన్"తో మేకపాటి రాజమోహన్‌రెడ్డి కుమారుడు గౌతంకి వున్న స్నేహపూర్వక సంబంధాల కారణంగానే మేకపాటి కుటుంబం జగన్‌కి దగ్గరయ్యింది.

రాజకీయాలలో సీనియర్ కావడం, ఢిల్లీ స్థాయిలో ఎక్కువ మందితో వున్న పరిచయాలు రాజమోహన్‌రెడ్డికి కలిసొచ్చాయి. ఈయన జిల్లాలో మంచి గుర్తింపు వున్న నాయకుడేమో అన్న భ్రమను "జగన్"కు కల్పించాయి. ఇక్కడే అంతటి మేధావి "జగన్" సైతం తప్పులో కాలేశాడు. వార్డు స్థాయిలో కూడా నాయకత్వాన్ని నెరపలేని రాజమోహన్‌రెడ్డిని కేంద్రస్థాయిలో సభ్యుడిగా నియమించాడు. కాని రాజమోహన్‌రెడ్డి మాత్రం తన రాజకీయాన్ని మండలస్థాయికే పరిమితం చేశాడు. జిల్లాలో కాకాణి నాయకత్వానికి చెక్‌పెట్టే ప్రయత్నం చేశాడు. పార్టీని విజయపథంలో నడిపించి భవిష్యత్తులో శక్తివంతమైన పార్టీగా వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీని అవతరింపజేయాలన్న కాకాణి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేస్తూ వచ్చాడు.

వాస్తవానికి రేపు ఎన్నికల్లో "జగన్" గాలిలో గెలిచినా భవిష్యత్తులో వారి నాయకత్వం పార్టీకి గట్టి పునాదులు కావాలన్న లక్ష్యంతో "కాకాణి" అభ్యర్థుల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే, మేకపాటి సోదరులు అందుకు విరుద్ధంగా ప్రవర్తించారు. జగన్ గాలిలో మూడులక్షలకు పైగా మెజారిటీని తెచ్చుకుని అది తమ బలుపుగా చిత్రీకరించుకున్నారు. అదే ధీమాతో "జగన్" అండతో అల్పులనైనా గెలిపించుకోగలమన్న మూర్ఖత్వంతో నెల్లూరురూరల్‌లో ఆనం వెంకటరమణారెడ్డిని, నెల్లూరు నగరంలో స్టార్ అజీజ్‌ని, కావలిలో రవీంద్రరెడ్డిని, వెంకటగిరిలో పావకన్నుని ప్రోత్సహించారు. కాని "జగన్" అమాయకుడు కాదు. అసమర్ధుడు అంతకంటే కాదు. తనదైన శైలిలో ఇన్‌ఛార్జ్‌ల రూపంలో అన్ని నియోజకవర్గాల అభ్యర్థులను ముందుగానే ప్రకటించేశాడు. ఒక్క ఆత్మకూరు, ఉదయగిరి, నెల్లూరు పార్లమెంటులను మాత్రమే మేకపాటి కుటుంబానికి అప్పజెప్పి వారి స్థాయిని అక్కడికే పరిమితం చేశారు.

ఈ పరిణామాలు ఏ మాత్రం మింగుడుపడని మేకపాటి సోదరులు కాకాణి నాయకత్వాన్ని గెలికారు. కన్వీనర్ పదవి నుండి కాకాణిని తొలగించి, కనీసం అదైనా తమ అభ్యర్థికివ్వాలని లేదంటే తమ పరువు పోతుందని "జగన్"ని ప్రాధేయపడ్డారు. కాని "జగన్" మరోసారి తన నాయకత్వపు గుణాన్ని ప్రదర్శించాడు. కాకాణిని కన్వీనర్ పదవి నుండి తప్పుకోమని చెప్పి ఎవ్వరూ వూహించని స్థాయిలో కేంద్ర కమిటీలో కార్యనిర్వాహక సభ్యుడిగా తీసుకున్నాడు. తమ అభ్యర్థి మేరిగ మురళిని జిల్లా పార్టీ కన్వీనర్ పదవిలో కూర్చోబెట్టామన్న ఆనందాన్ని అరక్షణం కూడా మేకపాటి సోదరులకు మిగలనివ్వకుండా చావుదెబ్బ కొట్టాడు. వ్యక్తిగా కాకాణి చాలా సౌమ్యుడు. నాయకుడిగా చాలా ఘటికుడు. పార్టీ కన్వీనర్ పదవికి రాజీనామా చేయమన్న హైకమాండ్ ఆదేశాన్ని శిరసావహించాడు. "జగన్" మాటే తనకు శిరోధార్యమని బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా, సర్వేపల్లి నియోజకవర్గ కన్వీనర్‌గా తన బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నాడు. తన రాజీనామాని సమర్పించి పార్టీలో ఎలాంటి అంతర్గత విభేదాల్లేవని హుందాగా ప్రకటించాడు. అయితే ఆయన వూహించని గౌరవాన్ని పార్టీ ఆయనకిచ్చింది. ఇప్పటికే వున్న జోడు పదవులకు తోడుగా కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఆయనను నియమించి రాష్ట్ర స్థాయిలో మీలాంటి నాయకుడి సేవలు మాకు అవసరం అనే సందేశాన్ని ప్రజలకు పంపింది. కంగ్రాట్స్ టు "గోవర్ధన్‌రెడ్డి".

స్వార్థరాజకీయాలకు వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీలో స్థానం లేదని చెప్పకనే చెప్పాడు. లీడర్ అంటే ఎలా వుండాలో చూపకనే చూపాడు. సమర్థతకు, విధేయతకు వున్న తేడాని, సమర్థతకు పార్టీలో లభించే ప్రాధాన్యతని తన చేతల్లో చూపాడు. దటీజ్ జగన్.

# కలెక్టర్‌గా రెండేళ్ళు

(3వ పేజీ తరువాయి)

ఏర్పాటుచేయించి, రైతులకు గిట్టుబాటు ధరలు ఇప్పించారు. హరిజన, గిరిజన వర్గాల అభ్యున్నతికి ఆయన విశేషకృషి చేసారు. ఆయన మాటల్లో పొదుపు పాటిస్తాడు. కాని పని విషయంలో అదుపులేదు. నా జీతం నాకొస్తుంది. ఇంతవరకే పనిచేస్తే చాలులే అనే నియమం పెట్టుకోలేదు. సన్‌డేను జాలీడేగా ప్రకటించుకోలేదు. ఎవ్రీడే ఈజ్ ఎ వర్కింగ్‌డే అనే పాలసీని పెట్టుకుని ప్రజల కోసమే ప్రతి నిముషం పనిచేస్తున్న ఇలాంటి అధికారి ఇంకొంత కాలం ఈ జిల్లాలోనే పనిచేయాలన్నది ప్రజాభీష్టం.

# జిల్లా కన్వీనర్‌గా మురళి


(మొదటిపేజీ తరువాయి)

రాపూరు మండల టీడీపీ అధ్యక్షుడిగా పనిచేసారు. జగన్ వైకాపాను స్థాపించాక ఆ పార్టీలో చేరి మేకపాటి అనుచరుడిగా ముద్రపడ్డారు. ఆయనకు పదవి ఇప్పించడానికి మేకపాటి సోదరులు తెగ తంటాలు పడ్డారు. కన్వీనర్ మార్పుతో పార్టీలో అంతర్గతంగా రగులుతున్న విభేదాలు ఒక్కసారిగా తెరకెక్కాయి. గౌతంరెడ్డితో వున్న స్నేహంవల్ల జగన్ మేకపాటి సోదరులకు ప్రాధాన్యతనిస్తూ వచ్చారు. అయితే తండ్రి, చిన్నానలు కలిసి జగన్ వద్దవున్న గౌతం పరువుప్రతిష్ఠలకు కూడా చేటు తెస్తున్నారు. భవిష్యత్ రాజకీయాలలో బలపడాల్సిన గౌతం ఇలాంటి రాజకీయాలకు దూరంగా వుంటే మంచిది. పంతం పట్టి కాకాణి చేత రాజీనామా చేయించి తమ మనిషిని కన్వీనర్‌గా పెట్టుకున్న మేకపాటి సోదరులు ఇక ముందు పార్టీ కార్యక్రమాలను ఎంతబాగా వెలగబెడతారో చూడాలి!

దయచేసి వినండి...
కృపయా జాన్‌సే....

# చెత్తవేస్తే... ఫైన్

ఇకమీదట రైల్వేస్టేషన్లో గాని...ఫ్లాట్‌ఫాంలపైనగాని ప్రయాణీకులు చెత్తాచెదారాలు వేస్తే ఖచ్చితంగా రెండొందలు జరిమానా చెల్లించాలి. ఇది బుధవారం నుండే అమలులోకి వచ్చింది. చెత్తను వేసే వారిని పసికట్టేందుకు ప్రత్యేకబృందాలు కూడా రెడీ అవుతున్నాయి. వీళ్ళలో టిక్కెట్టు కలెక్టర్లు, స్టేషన్‌మాస్టర్లు, స్టేషన్ సూపర్‌వైజర్లు ఉంటారంట. ప్రయాణీకులు చెత్తా చెదారాలను స్టేషన్ ఆవరణంలో ఫ్లాట్‌ఫాంలో ఏర్పాటుచేసిన డస్ట్‌బిన్‌లోనే వేయాలి. ఫ్లాట్‌ఫాంల మీద వేస్తే జరిమానాను ఖచ్చితంగా వసూలు చేస్తామంటున్నారు నెల్లూరు చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కిషోర్, స్టేషన్ మేనేజర్ షాజహాన్‌లు. మరి...వీళ్ళకు వేరే పని లేనట్టు...

PDF Compressor Free Version



# నెల్లూరు కబుర్లు

## సోగ్గాడు వస్తున్నాడు



ఆరు నెలలుగా నెల్లూరు ప్రజలకు, నెల్లూరు నేలకు, ఈ గాలికి, ఈ తిండికి దూరమై రాముడు అరణ్యవాసానికి వెళ్లినట్లుగా, వీరప్పన్ అడవులకే పరిమితమైనట్లుగా కేవలం హైదరాబాద్ నగరానికే అతుక్కుపోయివున్న సింహపురి సోగ్గాడు, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి మే 5వ తేదీన నెల్లూరులో అడుగుపెట్టబోతున్నాడని తెలిసింది. అనారోగ్య కారణంగా దాదాపు ఆరునెలల నుండి ఆయన హైదరాబాద్‌లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇంట్లోనే వుంటున్నాడు. ఈమధ్యలో సినిమాలు లేవు, షికార్లు లేవు. అంతకు ముందు నెలకోసారి తిరుమల వెళ్లి వెంకన్న దర్శనం చేసుకునేవాడు. ఆరు నెలలుగా ఆ దర్శనాలు కూడా లేవు. వెంకన్నకు వివేకాకు మధ్య ఇంత గ్యాప్ కూడా ఎప్పుడూ లేదు. వివేకా అనారోగ్యం నుండి బాగా కోలుకున్నాడు. వదిలితే చిరుతపులిలా పరిగెత్తేటట్టు తయారయ్యాడు. మే5వ తేదీ ఆయన నెల్లూరొస్తారని, వస్తూ వస్తూ తిరుపతిలోనే దిగి వెంకన్న దర్శనం చేసుకొని వస్తారని సమాచారం.



ఈ నెల 23వ తేదీన గూడూరు మండలం చెన్నూరులో ఎన్‌ఆర్‌ఇజియస్ పనులను పరిశీలించి, అనంతరం కార్మికులతో కలసి చెట్ల క్రింద కూర్చుని భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్

## దళితులను దగాచేస్తున్న కాంగ్రెస్

### -: టిడిపి జిల్లా పరిశీలకుడు పయ్యావుల కేశవ్ :-

పరిశ్రమల పేరుతో ఉన్న భూములను లాక్కుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల పాలిట రాబందువని టిడిపి ఎమ్మెల్యే, జిల్లా పరిశీలకుడు పయ్యావుల కేశవ్ విమర్శించారు. సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తొమ్మిదేళ్ళ కాంగ్రెస్ పాలనలో దళితుల నుంచి ఎంత భూమిని స్వాహా చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు హయాంలో దళితుల కోసం భూముల కొనుగోలు పథకం ప్రవేశపెట్టామన్నారు. వైయస్సార్ హయాంలో వేలకు వేలు ఎకరాల భూములను విద్యుత్ ప్రాజెక్టులకు ధారాదత్తం చేశారని ఆరోపించారు. జెన్‌కో సిబ్బంది ఇళ్ళ కోసం కేటాయించిన స్థలంలో యాష్‌పాండ్ ఏర్పాటు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ప్లాంట్లకు 50వేల ఎకరాలను కట్టబెట్టి ప్రభుత్వం ప్రజల జీవితాలతో ఆడుకుంటుందని ఆరోపించారు. ఈ సమావేశంలో టీడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, బాలకృష్ణ చౌదరి, జలదంకి సుధాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దువ్వూరు జయంతిసభ



వాడ్రేవు చినవీరభద్రుడ్ని సత్కరిస్తున్న అతిథులు

కవి కోకిల దువ్వూరు రామిరెడ్డి 117వ జయంతి సభ ఈనెల 20న దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాల్లో జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమశాఖ అడిషనల్ డైరెక్టర్ వాడ్రేవు చినవీరభద్రుడ్ని సన్మానించారు. అనంతరం చినవీరభద్రుడు మాట్లాడుతూ దువ్వూరు రామిరెడ్డి 8భాషల్లో అనర్గళంగా మాట్లాడేవారన్నారు. తెలుగులోనే కాకుండా ఇంగ్లీషులోను కవితలు రాసేవారన్నారు. ప్రముఖ న్యాయవాది పి.వి.రమణారెడ్డి మాట్లాడుతూ దువ్వూరు రామిరెడ్డి ఆంధ్రకవుల్లోని అగ్రగణ్యుల్లో ఒకరని కొనియాడారు. సభకు ముందు సుప్రసిద్ధ సంగీత విద్వాంసురాలు బాలార్క శిష్యురాండ్రు ఆశ్రిత, స్నేహ, మానస, సంధ్య, మనస్విని, దివ్య, గౌతమి. గిరిజలు ఆలపించిన భక్తిగీతాలు అందరిని అలరించాయి. ఈ సభలో సహస్ర సభా సింహం బి.వి.నరసింహం, జేవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా

## కోట గురుబ్రహ్మాం



ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా కోట గురుబ్రహ్మాంను నియమిస్తూ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ళకూరి నాగేశ్వరరావు(నాగబాబు) ఉత్తర్వులు జారీచేశారు. ఈ పదవిలో ఆయన 2013 నుండి 2015వరకు తన సేవలందిస్తారు. కోట గురుబ్రహ్మాం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా 2011 నుండి 2013 వరకు పనిచేశారు. తన హయాంలో "వాసవి ఉపాధిహామీ" పథకం ద్వారా దాదాపు 500 పేద ఆర్యవైశ్య కుటుంబాలకు గ్రైండర్లు, కుట్టుమిషన్లు వంటివి ఉచితంగా పంపిణీ చేసి వారి స్వయంఉపాధికి చేయూత నందించారు. అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నెల్లూరులో ఆర్యవైశ్య ఉచిత వివాహ వేదికను ఏర్పాటుచేసి దాదాపు 600జంటలకు సంబంధించి వధూవరుల వివరాలను అందించారు. ఆయన నియామకం పట్ల శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎం.ద్వారకానాథ్, ఉపాధ్యక్షులు ఎన్.వి.ప్రసాద్, కార్యదర్శి సరాబు వెంకటేశ్వర్లు, కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేసారు.

### లైంగికదాడులకు నిరసనగా

## కొవ్వొత్తుల ప్రదర్శన

లైంగికదాడులకు నిరసనగా 20వ తేదీ టిడిపి నగర ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన జరిగింది. సోనియా గాంధీ పాలనలో మహిళలపై లైంగిక దాడులు పెరిగాయని టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర విమర్శించారు. ఐదేళ్ళ చిన్నారిపై లైంగికదాడికి నిరసనగా నెల్లూరు గాంధీబొమ్మ నుండి నర్తకి సెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ చిన్నారిపై లైంగికదాడి అందరినీ కలచి వేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో లైంగికదాడులు, అవినీతి, దోపిడీలు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ ఇన్ ఛార్జి కిలారి వెంకటస్వామినాయుడు, టిడిపి నాయకులు వై.వి.సుబ్బారావు, ధర్మవరం సుబ్బారావు, శింగంశెట్టి రవిచంద్ర, బాల కృష్ణచౌదరి, ఖాదర్‌బాష పాల్గొన్నారు.

## బార్లలో టీవీలు చూడొద్దంట

### పోలీసుల వింత వైఖరి

ఐపిఎల్ పందేల ఉచ్చులోపడి యువకులు జూదరులై కోట్ల రూపాయలు పోగొట్టుకుంటున్నారు. ఐపిఎల్ పందేలను అరికట్టడానికి మన నగర పోలీసులు ఓ వెరైటీ కార్యక్రమం చేపట్టారు. నగర డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి సోమవారం నగరంలోని బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులతో సమావేశమై బార్లలో భారీఎత్తున క్రికెట్ పందేలు జరుగుతున్నందున టీవీలలో ఐపిఎల్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారాలు నిలిపివేయాలని కోరారు. టీవీలలో మ్యాచ్‌లను చాలామంది సరదాగా చూస్తారు. కొద్దిమంది పందేల కోసం చూస్తారు. క్రికెట్ మ్యాచ్‌ల మూలంగా సమాజం చెడిపోతుందంటే ఆ క్రికెట్‌పైనే నిషేధం పెట్టాలి. బార్లలో టీవీలను కట్టేసినంత మాత్రాన పందేలు కాసేవాళ్లను ఆపగలరా? చెడిపోవాలనుకున్న వాడిని ఆ దేవుడు కూడా బాగుచేయలేడు కదా! బార్లలో కాకపోతే పోలీసులు రాని అడవుల్లో, తోటల్లో టీవీలు పెట్టుకుని పందేలు కడుతుంటారు. బార్లలో క్రికెట్ మ్యాచ్‌లను పెట్టొద్దని పోలీసులు చెప్పడం ఎలా వుందంటే నర్తకిసెంటర్‌లో ముమైత్ ఖాన్ డ్యాన్స్ ప్రోగ్రాం ఏర్పాటుచేసి ఆ దారిన పోయేవారిని కళ్లుమూసుకుని పొమ్మన్నట్లుగా వుంది.

## డిఎస్పీ శ్రీనివాసరావుకు సత్కారం



శ్రీనివాసరావును సత్కరిస్తున్న పోలీస్ సిబ్బంది

నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం హోంగార్డ్స్ ఆర్ఐ కేజేఎం చిరంజీవి, ఆర్‌ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో డిఎస్పీ శ్రీనివాసరావు వీడ్కోలు సభను నిర్వహించారు. హోంగార్డ్స్ డిఎస్పీగా నెల్లూరులో బాధ్యతలు నిర్వహిస్తూ ఇటీవల తిరుపతి అర్బన్ ఏఆర్ డిఎస్పీగా యస్.శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీనివాసరావు సేవలను కొనియాడి, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హోంగార్డ్స్ డిఎస్పీ రామకృష్ణరావు సిబ్బంది పాల్గొన్నారు.

### జూనియర్ ఇంటర్ ఫలితాల్లో...

## విశ్వసాయి జయకేతనం




విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక సిబ్బంది

ఈనెల 22న విడుదలైన జూనియర్ ఇంటర్ పరీక్షాఫలితాలలో నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు జయభేరి మోగించారు. బైపీసీ విభాగంలో యం.రిషిత, ఏఎల్ వియస్ లాలస, ఎన్.అనూషరెడ్డి ముగ్గురూ 440మార్కులకు 433మార్కులు సాధించి ప్రథములుగా నిలిచారు. యంపీసీ విభాగంలో పి.రిషిత, కె.సాయిహేమంత్, డి.త్రినేష్‌లు ముగ్గురూ 470మార్కులకు 462మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. మిగిలిన విద్యార్థుల్లో 123మంది 400పైన మార్కులు సాధించడం జరిగింది. పరిమిత విద్యార్థులతో ఈ విజయాన్ని సాధించిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని, విద్యార్థులను కళాశాల ఛైర్మన్ డా॥ఎన్.సత్యనారాయణ, వైస్‌ఛైర్మన్ జి.కృష్ణమోహన్‌లు అభినందించారు.

PDF Compressor Free Version





ఈ నెల 22వ తేదీన నెల్లూరు పద్మావతి సెంటర్‌లో జరిగిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అవగాహనా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి. వేదికపై కాంగ్రెస్ నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి, బర్నాబసు తదితరులు

## 'అమ్మహస్తం' పేదల నేస్తం

సింహపురి సమాచారం

రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్ కార్డు దారుల ప్రయోజనార్థం నిత్యావసర వస్తువులు చౌకగా పంపిణీ చేసేందుకు అమ్మహస్తం కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు మండల రెవెన్యూ కార్యాలయంలో అమ్మహస్తం కార్యక్రమాన్ని మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధానంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినందున తెల్లరేషన్ కార్డుదారుల ప్రయోజనార్థం వినూత్నరీతిలో పేద, మధ్యతరగతి వర్గాలవారికి అమ్మహస్తం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉగాదినాడు హైదరాబాదులో లాంఛనంగా ప్రారంభించారన్నారు.



మహిళలకు సరుకులను అందజేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అమ్మహస్తం కార్యక్రమంలో 292రూ॥లుగల 9రకాల నిత్యావసర వస్తువులైన కందిపప్పు, పామాయిల్, గోధుమపిండి, గోధుమలు, చక్కెర, ఉప్పు, కారం, చింతపండు, పసుపు, వస్తువులను కేవలం 185రూ॥లకే అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో అమ్మహస్తం కార్యక్రమం ద్వారా 2.25కోట్ల మంది రేషన్‌కార్డు దారులకు అందజేయడం జరుగుతుందన్నారు. రెండవవిడత రచ్చబండ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను పరిశీలించిన తదుపరి కొత్తగా మరో 15లక్షల మంది రేషన్‌కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు బి.శ్రీధర్, అదనపు జాయింట్ కలెక్టర్ సి.హెచ్.పెంచలరెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు ధనుంజయరెడ్డి, రమణారెడ్డి, ఆదిశేషయ్య, నెల్లూరు ఆర్.డి.ఓ మాధవీలత, డిప్యూటీ కమీషనర్ భాగ్యలక్ష్మి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డి.యం సుధాకర్‌రావు, తహశీల్దారు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## విమర్శలను పట్టించుకోను

### - జిల్లా ఎస్పీ రమణకుమార్

స్వచ్ఛంద కార్యక్రమాలు చేసేటప్పుడు విమర్శలు సర్వ సాధారణమని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్ పేర్కొన్నారు.



ప్రసంగిస్తున్న ఎస్పీ బి.వి.రమణకుమార్

ఆదివారం కొత్తూరు వద్ద గల ప్రగతి ఛారిటీస్ భవనంలోని అదనపు గదులను ఎస్పీ ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సేవాగుణం అవసరమని, ఉద్యోగాలు, వ్యాపారాల్లో బిజీగా వున్నా సమాజసేవ చేస్తే జీవితానికి సార్థకత వుంటుందన్నారు. అంగవైకల్యంతో బాధపడుతున్నవారు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. అనాథపిల్లలను ఆదుకోవడంలో ప్రగతి ఛారిటీస్ చొరవ ప్రశంసనీయమన్నారు. తాను స్థాపించిన క్యాప్ సంస్థకు భారీఎత్తున నిధులు ఇచ్చేందుకు ప్రవాస భారతీయుల ముందుకు వస్తున్నా పలు ఆరోపణలు దృష్ట్యా వాటిని తిరస్కరించానని కేవలం పోలీస్ అధికారులు, సిబ్బంది నుంచి వసూలు చేసిన విరాళాల ద్వారానే క్యాప్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజసేవలో ఉండి విధి నిర్వహణను విస్మరిస్తున్నారనుకుంటే పొరపాటేనని జిల్లాలో ఇటీవల జరిగిన పలునేరాలను త్వరగా ఛేదిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో రూరల్ డిఎస్పీ బాలవెంకటేశ్వరరావు ఛారిటీస్ కార్యదర్శి వి.సుశీలమ్మ, కోశాధికారి కృష్ణారెడ్డి, అదనపు గదుల దాత కాకాణి పాండురంగారెడ్డి, స్వచ్ఛందసంస్థలు ప్రతినిధులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో నెల్లూరు రెపరెపలు



న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన ప్రతిష్టాత్మకమైన ఇండియన్ లా ఇన్‌స్టిట్యూట్ గవర్నింగ్ కౌన్సిల్ ఎన్నికల్లో కౌన్సిల్ సభ్యులుగా నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం గుంటకట్టకు చెందిన డాక్టర్ అన్నం సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. విశాఖపట్టణంలోని ఆంధ్రా యూనివర్శిటీ న్యాయ విభాగంలో ఆచార్యులుగా సేవలందిస్తున్న డాక్టర్ అన్నం సుబ్రహ్మణ్యం కౌన్సిల్ సభ్యులుగా ఎన్నిక కావడం ఇది రెండోసారి. ప్రతి మూడేళ్ళకు ఒకసారి జరిగే ఈ ఎన్నికల్లో జడ్జీల కేటగిరిలో 5మందిని, విశ్వవిద్యాలయాల కేటగిరీలో 10మందిని ఎన్నుకుంటారు. జాతీయస్థాయిలో జరిగే ఇండియన్ లా ఇన్‌స్టిట్యూట్ గవర్నింగ్ కౌన్సిల్ ఎన్నికల్లో సభ్యులుగా మన జిల్లాకు చెందిన మేథావి డాక్టర్ అన్నం సుబ్రహ్మణ్యం ఎన్నికకావడం మనందరికీ గర్వకారణం.

ఆయనకు 'లాయర్' హృదయపూర్వక శుభాభినందనలు.

## నెల్లూరులో క్రికెట్ బుకీలు

నెల్లూరు నగరంలో క్రికెట్ బెట్టింగులు జోరుగా జరుగుతున్నాయన్న సమాచారంతో ఆదివారం రాత్రి లాడ్జీలు, బార్ అండ్ రెస్టారెంట్లపై పోలీసు అధికారులు దాడులుచేసి ఇద్దరు బుకీలను అరెస్ట్ చేసారు. నెల్లూరు మూలాపేట రావిచెట్టు సెంటర్ వద్ద ఆ ప్రాంతానికి చెందిన గూడదాసు, ఇరుకళల సంఘానికి చెందిన వి.మల్లిఖార్జునను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులిద్దరూ గత కొంతకాలంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు నిఘా ఎక్కువగా ఉండడంతో ఇళ్ల వద్దకే వెళ్ళి బుకింగ్‌లు చేసుకుంటున్నారని నిందితుల వద్ద నుంచి 29వేల 570రూపాయలు నగదు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో 1,2,3,4 పోలీస్ స్టేషన్ల సిఐలు మద్ది శ్రీనివాసరావు, ఎన్.కోటారెడ్డి, కె.వి.రత్నం, జి.రామారావు, డిఎస్పీ ఐడి పార్టీ సిబ్బంది సాగర్, కిషోర్, ఐడి పార్టీ కానిస్టేబుల్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్సీపీ కార్యకర్తలకు శిక్షణ



కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని వైయస్సార్సీపీ కార్యకర్తలకు నెల్లూరు రామలింగాపురంలో శిక్షణా తరగతులు ఈనెల 21న ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వైయస్సార్సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ వైయస్సార్సీపీని పటిష్టపరిచేందుకు కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని, కార్యకర్తలు ప్రజల గుండెచప్పుడుకు ప్రతిధ్వనులై అధికారులపై ఒత్తిడి తెచ్చయినా సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. నాటి తెలుగుదేశానికి, నేటి కాంగ్రెస్‌కు తేడాలేదని అన్నారు. సంక్షేమంగా సాగిన మహానేత వైయస్సార్ పాలనలో సామాన్యుడిదే రాజ్యమని తెలిపారు. అటువంటి పాలనను ప్రజల చెంతకు తీసుకెళ్ళేలా కార్యకర్తలు ఆత్మీయ సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రోజుకు 10పోలింగ్ బూత్‌ల చొప్పున 20రోజుల పాటు శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు.

కార్యక్రమంలో దేవిశెట్టి రాజ గోపాల్, జానా శివప్రసాద్‌గౌడ్, వరాల లక్ష్మీనారాయణ, కోట్లపూడి మల్లికార్జున, వేల్పుల అజయ్, రమణమ్మ, పట్రంగి అజయ్‌లు పాల్గొన్నారు.

## షార్ డైరెక్టర్... పదవీకాలం పొడిగింపు



శ్రీహరికోటలోని భారత అంతరిక్ష ప్రయోగకేంద్రమైన సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ ఎం.వై.ఎస్. ప్రసాద్ పదవీకాలాన్ని రెండేళ్ల పాటు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మే31వ తేదీ ఆయన ఉద్యోగ విరమణ చేయాలి, కాని భారత అంతరిక్ష పరిశోధనలకు ఆయన సేవల అవసరాన్ని గుర్తించి మరో రెండేళ్ల పాటు ఆయన సర్వీసును పొడిగించారు. 2015 మే31వ తేదీ వరకు ఆయన విధుల్లో వుంటారు.

## నారాయణ విజయదుందుభి



డీన్ విజయశేఖర్‌రెడ్డితో విద్యార్థినీవిద్యార్థులు

జూనియర్ ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించి నారాయణ విద్యాసంస్థలు విజయదుందుంభి కొనసాగిస్తున్నాయని విద్యాసంస్థల అకడమిక్ డీన్ విజయశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నెల్లూరు హరనాథపురం ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకు పి.శేతుశ్రీ 435మార్కులతో జిల్లా ప్రథమస్థానం సాధించిందన్నారు. అదే విధంగా టి.లక్ష్మి వెంగమాంబ 434 మార్కులు సాధించారన్నారు. 432మార్కులను 8మంది 431మార్కులను 14మంది, 430మార్కులను 17మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపిసి విభాగంలో తమ విద్యాసంస్థ విద్యార్థులు పి.సుజిత్ శ్రీను, ఐ.నరేంద్ర, మారుపూడి శ్రావ్య కొల్లి లక్ష్మణ్, మేకా ప్రవీణ్‌కుమార్, ఆర్.తనుజ 470మార్కులకు 464మార్కులు సాధించి స్టేట్ టాప్‌లో నిలిచారన్నారు. 463 మార్కులను 21మంది విద్యార్థులు, 462 మార్కులు 37మంది 461మార్కులు 57మంది, 460మార్కులు 94మంది విద్యార్థులు సాధించారన్నారు. ఎంఇసీలో 500మార్కులకుగాను తమ విద్యార్థులు పి.గగన్ 477, కె.స్రవంతి 476, ఎం.అంజలి 475 మార్కులు సాధించారన్నారు. ఈ సమావేశంలో ఏజియం మధుసూదనరెడ్డి, కృష్ణారెడ్డి, హజరత్, బాలకృష్ణారెడ్డి తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



## కదంబం

### యోగ

డాక్టర్ దేవరాజు మహారాజు
హైదరాబాద్. 9908633949


పదాల పలకరింపు ఒక స్పర్శ
పద-అర్థాల చూపూ ఒక స్పర్శే
క్రీడగా మొదలుపెట్టి
పదాల్లో నలిగిపోవడం
వాక్యాల్లో ఒదిగిపోవడం
కవిత్వంలో కలిసిపోవడం
మాయమైపోవడం
ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ
ప్రపంచాన్నే మరిచిపోవడం
ఒక మహాధ్యానం!
నూతన సమాజ నిర్మాణం కోసం
నిత్య నూతనంగా సాగిపోయే
కవిత్వం రాయడం
ఒక మహాయోగం!!

### 30న మహాకవి శ్రీశ్రీ 103వ జయంతి సభ



మానవుడే నా సందేశం! మనుష్యుడే నా సంగీతం! అని ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీశ్రీ 103వ జయంతి సభ ఈనెల 30న నెల్లూరు టౌనుహాలులో మహాకవి శ్రీశ్రీ ప్రగతి ట్రస్టు నెల్లూరు వర్ధమాన సమాజం సంయుక్త నిర్వహణలో జరుగుతుంది. సభకు అధ్యక్షులుగా ప్రముఖ న్యాయవాది మజ్జిగ ప్రభాకర్ రెడ్డి వ్యవహరిస్తారని, ఉపన్యాసకులుగా కడపకు చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సంజీవమ్మ, అనంతపురంకు చెందిన సాహితీ ప్రముఖులు సింగమనేని నారాయణ, అమెరికాలో నివసిస్తున్న సుప్రసిద్ధ శాస్త్రవేత్త డాక్టర్ తెలకపల్లి సుబ్బయ్యలు పాల్గొంటారని ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వేమలపాటి అనంతరామయ్య, వర్ధమాన సమాజ అధ్యక్షులు వంటేరు వెంకటకృష్ణారెడ్డి, ట్రస్టు గౌరవాధ్యక్షులు డా॥ కాళిదాసు పురుషోత్తంలు సంయుక్త ప్రకటనలో తెలిపారు. శ్రీశ్రీ అభిమానులు, సాహిత్యాభిలాషులు, కవులు పాల్గొని సభను జయప్రదం చేయమని వారు కోరుతున్నారు.

### చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలు మే 30 నుండి



నెల్లూరుజిల్లా సూళ్ళూరు పేట చెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాలు మే నెల 30వతేదీ నుంచి జూన్ నెల 5వతేదీ వరకు నిర్వహించనున్నారు. ఏడేళ్ళకోసారి జరిగే ఈ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ పాలకమండలి విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రెండు రోజులు నిర్వహించే సుళ్ళ ఉత్సవం కోసం 2.25లక్షలతో కొత్త సుడిమాను కొనుగోలు చేసి తీర్చిదిద్దుతున్నారు. మరొక ప్రత్యేక ఉత్సవమైన తెప్పోత్సవం కోసం కాళంగినదిని ముస్తాబు చేస్తున్నారు. భక్తులకు వినోదం కోసం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

### ఉచిత బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

కావలి పట్టణంలోని టి.టి.డి కల్యాణమండపంలో మే నెల 5వతేదీ కావలి బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో ఉచిత వివాహ పరిచయ కార్యక్రమం జరుగుతుందని కన్వీనర్ దేవరపల్లి నాగరాజశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తికల బ్రాహ్మణులు వధువు లేదా వరుడి ఫోటో, జాతకం, బయోడేటా జతపరిచి 100/-రూ॥లు రుసుము చెల్లించి రిజిస్ట్రేషను చేసుకోమని కోరుతున్నారు. వివరాలకు 9492339160, 9030139073, 9441443407, 08626 240113, 9491078981 ఫోన్‌నెంబర్లలో సంప్రదించగలరు.

## ఒలింపిక్స్‌లో పతకం తెచ్చేవాణ్ణి

'లాయర్' తుంటర్వ్యూలో చంద్రబాబు

### శ్రీను గల్పిక

హైటెక్‌రత్న, ప్రతిపక్ష పద్మభూషణ నారా చంద్రబాబునాయుడు తన పాదయాత్రను పూర్తి చేసుకుని ముగింపుసభ కోసం విశాఖపట్నంకు చేరుకున్నాడు. ఆయన రెండుకాళ్లకు చాలా దిట్టంగా బ్యాండేజీలు కట్టి వున్నాయి. అడుగులో అడుగేసుకుంటూ ఆయన పార్టీ కార్యాలయానికి వచ్చాడు. వెంటనే ఓ లీటర్ నీళ్లు తాగి, పది నిముషాలు కళ్లు మూసుకుని పడుకున్నాడు. తర్వాత లేచి కుర్చీలో కూర్చున్నాడు. నేనండీ... సార్, పాదయాత్ర పూర్తయిన సందర్భంగా ఓ చిన్న తుంటర్వ్యూ కావాలని అడగడంతో ఆయన వెంటనే అంగీకరించాడు.

లాయర్ :- సార్! ఇన్నిరోజులు పాదయాత్ర చేసారుకదా! దీని ఫలితం ఏమైనా కనిపిస్తుందా?

బాబు :- బాగా కనిపిస్తుంది. నాకు అంతకుముందు షుగర్ వుండేది కాదు, పొగరు పోయి షుగర్ వచ్చింది. ఇక బి.పి కామన్.

లాయర్ :- నేను అడిగేది రోగాల గురించి కాదుసార్... పార్టీ పరంగా ఏమన్నా ప్రయోజనం వుందా? అని!

బాబు :- ఒలింపిక్స్‌లో పాదయాత్ర కాంపిటీషన్ గాని పెడితే గోల్డ్‌మెడల్ నేనే కొట్టేసేవాడిని. ఎందుకంటే అంత బాగా ఎక్స్‌పీరియన్స్ వచ్చింది. వచ్చే ఒలింపిక్స్ నుండి పాదయాత్ర పోటీలను ప్రవేశపెట్టాలని మన ప్రభుత్వం ద్వారా అంతర్జాతీయ ఒలింపిక్ సంఘాన్ని కోరాలనుకుంటున్నా!

లాయర్ :- పాదయాత్ర మూలంగా మీకు వ్యక్తిగతంగా కలిగిన ప్రయోజనమేదైనా వుందా?

బాబు :- లేకేం... నాకు ఇంటి ఖర్చులు బాగా తగ్గాయి. మూడుపూటలా తిండి ఖర్చు మా పార్టీవాళ్లే చూసుకున్నారు. నేను ఇంట్లో లేకపోయేసరికి ఈ రెండు నెలలు నా గదిలో ఏ.సి. ఆన్ చేయలేదు. దాంతో కరెంట్‌బిల్లు మిగిలింది. లేదంటే ఈ కిరణ్‌కుమార్‌రెడ్డి పెంచిన ఛార్జీలతో వచ్చిన కరెంట్‌బిల్లు కట్టాలంటే హెరిటేజ్ పాల ద్వారా వచ్చిన ఆదాయాన్నంతా దానికి మళ్లించాల్సివుండేది.

లాయర్ :- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడిపోకుండా మీరు కాపాడుతుండడానికి కారణం?

బాబు :- ఈ రాష్ట్ర ప్రజల మీద కక్ష తీర్చుకోవడానికి...!

లాయర్ :- కక్షా...? ఈ రాష్ట్ర ప్రజల మీదనే మీకు పగా? మిమ్మల్ని రెండుసార్లు ముఖ్యమంత్రిని చేసిన ప్రజల మీద అంత కక్ష ఎందుకు కట్టినట్లు?

బాబు :- నన్ను రెండుసార్లు అధికారానికి దూరంగా పెట్టారు. కాబట్టి ఆ ప్రజల మీద పగబట్టాను. కాని వై.యస్. వున్నంతకాలం ఆ పగ తీర్చుకునే అవకాశం రాలేదు. ఇప్పుడు కిరణ్‌కుమార్‌రెడ్డి రూపంలో నాకు కాలం కలిసొచ్చింది. విద్యుత్‌ఛార్జీలను పెంచి ప్రజలు తమ ఆస్తులను మార్వాడీల వద్ద తాకట్టుపెడుతున్నారు. కరెంట్ బిల్లులు కట్టలేక చాలామంది అప్పుల పాలయ్యారు. వీరందరినీ చూస్తుంటే నా కడుపు మంట చల్లారుతుంది. ఎందుకంటే ప్రజలు ఇప్పుడు నన్ను మరచిపోయి కిరణ్‌ను తిట్టుకుంటున్నారు. అయినా ఆయన లెక్క చేయకుండా ప్రజల్ని హింసిస్తూనే వున్నాడు. ప్రజలను ఇలా హింసపెట్టే ముఖ్యమంత్రి పూర్తికాలం పదవిలో వుండాలనే దృఢసంకల్పంతోనే నేను వారి ప్రభుత్వాన్ని కాపాడుతున్నాను.

లాయర్ :- మొన్న సహకార ఎన్నికలలో మాదిరిగానే రేపు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలలోనూ కాంగ్రెస్‌తో రహస్య అవగాహన వుంటుందా?

బాబు :- రహస్య అవగాహనేమీ లేదు... అంతా బహిరంగమే. జగన్‌ను ఓడించడానికి అవసరమైతే పొత్తు కుదుర్చుకుని కూడా పోటీ చేస్తాం.

లాయర్ :- ఈమధ్య సీనియర్ ఎన్టీఆర్, జూనియర్ ఎన్టీఆర్‌ల ఫోటోలు వైయస్సార్ కాంగ్రెస్ ఫ్లెక్సీలలో కనిపిస్తున్నాయి కదా? దీనిపై మీ కామెంట్స్?

బాబు :- మా మామ(ఎన్టీఆర్) మాకే సొంతం. ఆయన్ను వెన్నుపోటు పొడిచినా, పదవిలో నుండి దించినా, పార్టీలో నుండి తరిమేసినా? అల్లుడిగా అది నా హక్కు. అలాగే ఆయన ఫోటో కూడా మాకే సొంతం. ఆయన ఫోటో మీద పేటెంట్ హక్కు మాదే!

లాయర్:- వచ్చే ఎన్నికలలో మీ వియ్యంకుడు బాలకృష్ణను ప్రచారంలోకి దింపుతారా?

బాబు :- పార్టీకి గెలుపు అవకాశాలుంటే ఖచ్చితంగా దించం. ఎందుకంటే వచ్చే ఓట్లను పోగొట్టుకోవడమెందుకు? గెలుపు అవకాశాలు లేకుంటే మాత్రం ప్రచారానికి తిప్పుతాం... నిండా మునిగాక ఇక చలేం వుండదు కదా!

లాయర్ :- తెలంగాణలో మీ పార్టీ పొజిషన్ ఏమిటి?

బాబు :- ఇంకా కొంతమంది నాయకులు మిగిలివున్నారు. వాళ్లు కూడా ఏ టీఆర్ఎస్‌లోకో, వైకాపాలోకో పోతే అక్కడ వాకౌట్ ప్రకటిస్తాం.

లాయర్ :- మీ తనయుడు లోకేష్‌కు పార్టీ ప్రచార బాధ్యతలేమన్నా అప్పగిస్తారా?

బాబు :- లోకేష్‌కు ఏ పార్టీ ఎవరిదో ఇంకా అవగాహన రాలేదు. ప్రచారానికి పోయినప్పుడు అవతల పార్టీలకంటే మా తెలుగుదేశంపార్టీనే ఎక్కువగా తిడుతున్నాడు. ముందుగా తెలుగుదేశంపార్టీ మనది అనే ముద్ర అతని మనసులో బలంగా పడాలి. దాని తర్వాతే ఏదైనా.

లాయర్ :- వచ్చే ఎన్నికల్లో కూడా మీ పార్టీ అధికారంలోకి రాకపోతే పరిస్థితి ఏంటి?

బాబు :- ఇప్పటికే మా కేడర్‌కంతా హెచ్చరికలు జారీచేసాను. ఈసారి ఎన్నికలలో కూడా అధికారంలోకి రాకపోతే మన బ్రతుకు బస్టాండేనని. చాలామంది ముందుజాగ్రత్త చర్యగా పాత వ్యాపారాలను తిరిగి మొదలుపెడుతున్నారు. నామటుకు నేనైతే... పార్టీ గెలిస్తే ఈ రాష్ట్రానికి సిఇఓగా వుంటాను. లేదంటే హెరిటేజ్ ఫుడ్స్‌కు సిఇఓగా వుంటాను. ఇక వుంటాను. అవతల మీటింగ్‌కు టైమయ్యింది అంటూ లేచాడు.

★★★★★

### గాంధీజీ ఆశయాలే శరణ్యం

సమాజ సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే గాంధీజీ ఆశయాలే శరణ్యమని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ అదనపు సంచాలకులు, ప్రముఖ రచయిత వాడ్రేవు చినవీరభద్రుడు పేర్కొన్నారు. పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం ఆధ్వర్యంలో నెల్లూరు మద్రాసు బస్టాండు వద్దగల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశమందిరంలో 20వ తేదీ గాంధేయవాదంపై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చినవీర భద్రుడు మాట్లాడుతూ గాంధీజీ కలలుకన్న స్వరాజ్యం రావాలంటే మూడు అంశాలకు ప్రాధాన్యతనివ్వాలని, అవి పారిశుద్ధ్యం, ప్రాథమికవిద్య, వ్యవసాయం అన్నారు. పారిశుద్ధ్యం సమాజాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుతుందని, ప్రాథమిక విద్య భావి తరాలను కాపాడుతుందని, ఆరోగ్యం, ప్రాథమికవిద్య వ్యవసాయాన్ని కాపాడుతాయన్నారు. జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ మాట్లాడుతూ ప్రాథమికవిద్యతో విద్యార్థులు విజ్ఞానవంతులుగా మారుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం కన్వీనర్ గణేశన్ కృష్ణారెడ్డి, ఐఆర్‌సీయస్ సభ్యులు డా॥ ఏ.వి.సుబ్రహ్మణ్యం, పోలయ్య, సత్యాగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### పొలిటికేం ఒరిగేంది?


(మొదటిపేజీ తరువాయి)

పెద్ద ప్రశ్న. జగన్ అనే యువకుడు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని పెట్టకుండా కాంగ్రెస్‌లోనే వుండుంటే చంద్రబాబుకు పాదయాత్ర చేయాల్సిన అవసరం వుండేది కాదు. వస్తున్నా మీ కోసం అంటూ గాలికి, ఎండకు తిరగాల్సిన పని వుండేది కాదు. తమిళనాడులో పద్ధతే ఇక్కడా వుండేది. ఆ రాష్ట్రంలో డిఎంకె వద్దనుకుంటే అన్నాడిఎంకె, ఈ పార్టీని కాదనుకుంటే మళ్ళీ డిఎంకె. అధికార మార్పిడి ఆ రెండు పార్టీల మధ్యే జరుగుతుంది. 1983 నుండి 2009 వరకు మన రాష్ట్రంలో కూడా అధికార మార్పిడి కాంగ్రెస్, తెలుగుదేశంల మధ్యే జరుగుతుంది. జగన్ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించకపోయి వుంటే ప్రజల్లో పెరిగిన ప్రభుత్వ వ్యతిరేకత చంద్రబాబుకు అనుకూలమై వుండేది. అంటే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు రెండో రాజకీయప్రత్యామ్నాయం తెలుగుదేశమే! చంద్రబాబు పట్ల విశ్వసనీయత లేకపోయినా ప్రజలు కిరణ్ కంటే చంద్రబాబే తక్కువగా బాదాడనే సానుభూతి చూపేవాళ్లు. కాని ఇప్పుడు జగన్ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయమయ్యాడు. కొత్త నాయకుడు, వై.యస్. సానుభూతి తోడయ్యింది. ఇంకేముంది ప్రభుత్వ వ్యతిరేకత అంతా కూడా జగన్‌కు అనుకూలం కాగా, తెలుగుదేశంకు కేవలం సాంప్రదాయ ఓటుబ్యాంకు మాత్రమే మిగిలివుంది.

అధికారంలో వుంది కాబట్టి కాంగ్రెస్ ఆ బలంతో వుంది. ప్రజాదరణలో వైయస్సార్ కాంగ్రెస్ మహాస్ట్రాంగ్‌గా తయారయ్యింది. ఈ రెంటి మధ్య రెండు దఫాలు అధికారానికి దూరం కావడంతో పూర్తిగా బలహీనపడుతూ వచ్చింది తెలుగుదేశంపార్టీయే! రెండుసార్లు అధికారం లేకపోవడంతో కేడర్, లీడర్ కకావికలమయ్యారు. పార్టీని మరీ భూస్థాపితం చేయకుండా కాపాడుకోవాలంటే పార్టీ అధ్యక్షుడిగా చంద్రబాబు ఏదో ఒకటి చేయాల్సి వచ్చిన తరుణంలో ఆయన పాదయాత్రకు శ్రీకారం చుట్టారు.

నిర్విరామంగా 7నెలల పాటు 2500కిలోమీటర్లు చంద్రబాబు పాదయాత్ర నిర్వహించారు. ఆయన పాదయాత్ర పార్టీకి ఎంతవరకు ఉపయోగపడుతుందనే దానిపై అంచనాలు జరుగుతున్నాయి. ఆయన పాదయాత్ర పార్టీ కేడర్‌లో కొంత ఉత్సాహం నిలిపిందన్నది వాస్తవం. ఆయన పాదయాత్ర చేపట్టకముందు పార్టీ నిస్తేజంగా కనిపించింది. పార్టీ కార్యక్రమాలపై కేడర్‌లో ఉత్సాహం కనిపించేది కాదు. బాబు నడవడం మొదలుపెట్టాక కేడర్‌లో కదలిక వచ్చింది. ఇక ఓట్లు పరంగా చంద్రబాబు పాదయాత్ర ఎంతవరకు సక్సెస్ అయ్యిందనేదే సందేహం. జగన్ పార్టీ పెట్టినప్పుడే కొంత శాతం మంది ఓటర్లు ఆయనకు ఓటేయాలని డిసైడయ్యారు. ప్రభుత్వం మీద వ్యతిరేకత పెరిగే కొద్దీ కాంగ్రెస్‌కు కోతపడుతున్న ఓటు బ్యాంక్ అంతా జగన్ వైపే పోతుంది. మరోవైపు తెలంగాణ రాగం అన్ని పార్టీలకీ పెద్ద తలనొప్పిగా తయారయ్యింది. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రబాబుకు కొత్తగా పెరుగుతున్న ఓట్లు కనిపించడం లేదు. ఆయన ఇన్ని అవస్థలు పడిందే ఓట్ల కోసం అయినప్పుడు, అవి రాకపోతే ఎన్ని వేల కిలోమీటర్లు నడిచినా ఏం లాభం. ఆపరేషన్ సక్సెస్ అయ్యి పేషంట్ డెడ్ అన్నట్లుంటుంది.

## మేషం



అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము

బంధుముఖ్యుల ఆరోగ్య లోపం వార్తలువింటారు. క్రొత్త పరిచయాలు స్నేహాలు ఏర్పడి ఉపయోగపడ తాయి. విలువైన వస్తువులు, పరికరాలు కొంటారు. మంచి ఆర్థికాభివృద్ధి అవకాశాలు చేజారవచ్చును. వృత్తి వ్యాపారాలలో ఆదాయం ఖర్చు సరిపోతుంటుంది. చిన్న విషయాలు కూడా ఆందోళన కలిగిస్తుంటాయి. శుభ కార్యాలు నిర్ణయం కాగలవు.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తిపరంగా సామాన్య ఆదాయం ఉంటుంది. ఇంట శుభకార్య నిర్ణయాలు జరుగుతాయి. స్థిరాస్తులు (పొలాలు, స్థలాలు) లావాదేవీలు ఖాయం కాగలవు. సొంత వ్యాపారాలు, జాయింట్ వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. కుటుంబ వ్యక్తులతో చిన్న చిన్న సమస్యలపై విభేదాలుంటాయి. పనులవత్తిడి పెరిగి టెన్షన్ పడుతుంటారు. కోర్టుకేసులు వాయిదా పడగలవు.


## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కొన్ని అనవసర ఖర్చులు వారాంతంలో ఉంటాయి. శరీరశ్రమ వల్ల నలతగా ఉంటుంది. పనులందు టెన్షన్ పెరుగుతుంది. ఈ రాశి వారికి ఆదాయం పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలందు అభివృద్ధి, ఆదాయం పెరుగు తుంది. ఉద్యోగులకు అధికారులకు రావలసి బాకీలు మంజూరు కావడం, మంచి గుర్తింపు గౌరవాలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలు ఫలించును.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

షేర్లు పెట్టుబడులందు నిరాశ ఉంటుంది. పనుల వత్తిడి అకాలభోజనం వల్ల ఆరోగ్యం లోపమై బాధిస్తుంది. మీ నిర్ణయాలకు, పనులకు ఇంట్లో సభ్యుల నుండి ప్రతి కూలత ఉంటుంది. వ్యాపారరంగంలో అభివృద్ధి బాగుండి ఆదాయము పెరుగుతుంది. కొన్ని ఆర్థికావకాశాలు అనుకోకుండా కలసివస్తాయి. మీ పనులు ఇతరులకు అప్పగించవద్దు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, ఇంటర్వ్యూ అవకాశాలుండవచ్చును. వస్తు వాహన రిపేర్లుంటాయి. బిడ్డలకు అనారోగ్య సమస్యలుంటాయి. వృత్తి వ్యాపారా లలో పడే కష్టానికి తగ్గ ఆదాయం ఉండదు. అవసరాలకు ఏదో విధంగా డబ్బు సర్దుబాటు కాగలదు. వ్యాపారంలో క్రొత్త ప్రయత్నాలుంటాయి. శుభకార్య ప్రయత్నాలు ఆశాజనకంగా సాగుతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

శుభకార్యాలు నిర్ణయం కాగలవు. కోర్టు వ్యవహారాలు వాయిదాపడతాయి. బంధువర్గంలో అనారోగ్య వార్తలు వింటారు. తొందరపాటు నిర్ణయాల వల్ల తగాదాలు వచ్చే స్థితి ఉంది. వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. షేర్లకు పెట్టుబడులకు అవకాశాలు పొందుతారు. వస్తు నష్టం, వాహన, గృహ రిపేర్లుంటాయి. అనుకున్న పనులు నిదానంగా జరిగి విసుగు కలిగిస్తాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 26.4.2013 నుండి
తేది. 02.5.2013 వరకు

ఈ వారము మేషంలో రవికుజబుధ శుక్రకేతువులు, వృషభంలో గురువు, తులలో శనిరాహువులు, తుల వృశ్చికధనుర్మకర రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము :

తేది 1 బుధవారము "మేడే" ప్రపంచ కార్మిక దినము.

తేది 2 గురువారము శుక్రమౌఢ్యమి పరిసమాప్తి.

### చైత్రమాస కృష్ణ పక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 26 | శుక్ర | కృష్ణపాడ్యమి | రా॥ గం.12.00వ॥ |
| తేది. 27 | శని | విదియ | రా॥ గం.9.52వ॥ |
| తేది. 28 | ఆది | తదియ | రా॥ గం. 7.37వ॥ |
| తేది. 29 | సోమ | చతుర్థి | సా॥ గం. 5.13వ॥ |
| తేది. 30 | మంగళ | పంచమి | సా॥ గం. 2.25వ॥ |
| తేది. 01 | బుధ | షష్ఠి | ప॥ గం. 12.20వ॥ |
| తేది. 02 | గురు | సప్తమి | ఉ॥ గం. 10.06వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యాపారపరంగా మంచి అవకాశాలు దొరకవచ్చును. అనుకున్న పనులు మెలికపడి ముందుకు సాగవు. ప్రభుత్వ పరంగా ఉత్తర్వులు అనుమతులలో జాప్యం జరుగుతుంది. తప్పించుకొనలేని అదనపు ఖర్చులుంటాయి. ఆదాయం ఖర్చు సమానంగా ఉంటుంది. ఇతరుల విషయంలో జోక్యం చేసుకొని ఇబ్బందులు పడే పరిస్థితి ఉన్నది. అధికారుల తీరు ఉద్యోగులకు బాధాకరంగా ఉంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

బంధుముఖ్యులొకరికి అనారోగ్య వార్తలందుతాయి. ఉద్యోగులకు స్థానమార్పు, రావలసిన బాకీలు లభిస్తాయి. క్రొత్త వస్తువులు గృహోపకరణాలు కొంటారు. వ్యాపార అవకాశాలు ఒకటి రెండు చేజారిపోవచ్చును. వ్యాపారా లలో ఆదాయం ఒక మోస్తరుగా ఉంటుంది. వృత్తి జీవనము కల్గినవారు బాగా రాణిస్తారు. విద్యార్థులు పరీక్షలందు మంచి పాటవాన్ని ఉత్సాహాన్ని ప్రదర్శిస్తారు.


## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

సహచరులు సహాయపడతారు. శుభకార్యాల ప్రయత్నాలలో ముమ్మరంగా ముందుకు సాగుతారు. ఆస్తి వ్యవహారాలు, పెండింగ్‌లో గల పనులు తొందరగా తెమలవు. ఆర్థికముగా బాగుండి వృత్తి వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. చేయదలచిన పనులందు స్థిమితం ఉండదు. టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. విద్యా ర్థులు పరీక్షలందు కుదుటపడగలరు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కోర్టు వ్యవహారాలు, స్థిరాస్తుల లావాదేవీలందు అనుకూలత ఉంటుంది. ముఖ్య నిర్ణయాలకు ఇతరులు సహకారం తీసుకొంటే మంచిది. దీర్ఘకాలిక పెట్టుబడు లకు, వ్యాపారవిస్తరణకు అవకాశాలు లభిస్తాయి. ఈ రాశి వారికి ఆదాయ వ్యయాలు ఇంచుమించుగా సమానంగా ఉంటాయి. విద్యార్థులు పరీక్షలందు సంతృప్తి చెందుతారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తిపరంగా మంచి గుర్తింపు, వ్యాపారులకు అభివృద్ధి ఆదాయము బాగుంటుంది. ముఖ్యమైన చెల్లింపులు సకాలంలో జరుపుతారు. ఏర్పడిన సమస్యలు పరిష్కారము కాగలవు. ఉద్యోగప్రయత్నాలు చేసేవారు వచ్చిన అవకా శములు సద్వినియోగము చేసుకొంటే మంచిది. పారిశ్రా మిక యజమానులకు, కాంట్రాక్టర్లకు వర్కర్లతో సమస్యలు ఏర్పడగలవు. ఆరోగ్యము కూడా సరిగా ఉండదు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

బిడ్డల విద్యా ఉద్యోగ అవకాశాలు బాగుంటాయి. ఉద్యోగులు విధి నిర్వహణలో సమర్థత చూపుతారు. రావ లసిన బాకీలు అలవెన్సులు లభించగలవు. షేర్లు నష్టాలను చవిచూడవచ్చును. కోర్టు వ్యవహారాలు, ఆస్తి వ్యవహారాలు పరిష్కారము కాగలవు. శుభకార్యాల నిర్ణయంలో కాల యాపన జరుగవచ్చును. అనుకున్న పనులు సకాలంలో జరిగిపోతాయి.

# లైంగిక వేధింపులు...నిజమా కాదా...

నెల్లూరుజిల్లా సీతారామపురం ఎంపిడిఓ ఎం.మధుసూదనరావుపై ఆదివారం లైంగిక వేధింపు కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు సీతారామ పురానికి చెందిన నల్లగొండ్ల విజయలక్ష్మి, సరస్వతి ఉపాధి పనులు చేయిస్తూ బాపూజీ, నేతాజీ గ్రూపులకు మేట్లుగా వ్యవహరిస్తున్నారు. 2012 జూన్, జూలై నెలల్లో మూడు వర్క్ ఐడీలకు సంబంధించి 11వారాలు ఉపాధి పనులు చేసారు. దీనికి సంబంధించిన బిల్లులు చెల్లించాలని ఎంపిడిఓ మధుసూదనరావును విజయలక్ష్మి, సరస్వతిలు కలవగా అసభ్యంగా, అగౌరవంగా ప్రవర్తించారని దీంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. బాధితులు విజయలక్ష్మి, సరస్వతిలు మానసికంగా ఎంపిడిఓ మధుసూదన్‌రావు వేధిస్తున్నారని అతన్ని వెంటనే సస్పెండ్ చేయాలని, తన కోర్కె తీర్చితే అందుకు డబ్బు ఇస్తానని వేధిస్తున్న ఎంపిడిఓకు తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తుండగా, ఎపిడిఓ మధుసూదనరావు మాత్రం విజయలక్ష్మి, సరస్వతి అనే ఇద్దరు మేట్లు దొంగ మస్టర్లు వేసి పనులు చేయకుండానే కూలీలు చెల్లించాలని తీవ్రంగా వత్తిడి తెచ్చారని, గ్రామంలో లేని పేర్లను మస్టర్లలో నమోదు చేశారని, చనిపోయిన వారి పేర్లు కూడా ఉన్నాయం టున్నారు. వీరు పనిచేశామని చెబుతున్న పొలాలను పరిశీలిస్తే అక్కడ పనులే జరగలేదని, దొంగమస్టర్లుకు కూలీలు చెల్లించలేదనే కక్షతోనే తప్పుడు కేసులు బనాయించారని చెబుతున్నారు. ఇంతకీ లైంగిక వేధింపులు నిజమా..కాదా...కాలమే నిర్ణయిస్తుంది.

# మౌలికవసతుల కల్పనకు కృషి

నెల్లూరు నగరంలో ఎస్సీ, ఎస్టీలు నివ సిస్తున్న ప్రాంతాల్లో మౌలికవసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు నెల్లూరునగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పేర్కొన్నారు. 20వ తేదీ వెంగళరావ్ నగర్‌లో ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముంగమూరు మాట్లాడుతూ దళిత, గిరిజనుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చింద న్నారు. పక్కాగృహాలు నిర్మించుకునేందుకు గాను నిర్మాణ వ్యయాన్ని ప్రభుత్వం పెంచిం దన్నారు. ఎస్సీలకు లక్షరూపాయలు, ఎస్టీలకు రూ.1.05లక్షలు నిధులను మంజూరుచేస్తున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో అదనపు జాయింట్ కలెక్టర్ పెంచలరెడ్డి, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వై.వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఇడి డా॥ సోమయ్య, మెప్మా పిడి కమలకుమారి, నగరపాలక ఇన్‌ఛార్జి కమీషనర్ సంపత్ కుమార్, ఆనం రంగమయూర్‌రెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

**రోడ్ల అభివృద్ధికి కృషి:** నెల్లూరు నగ రంలో రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణా రెడ్డి పేర్కొన్నారు. 20వ తేదీ నెల్లూరు 17వ డివిజన్ పరిధిలోని కొండాయపాళెం సమీపంలో రూ.28.6లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బిటిరోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడుతూ నెల్లూరు మినీబైపాస్‌రోడ్డును రూ.10 కోట్లు వ్యయంతో ఆరులైన్ల రోడ్డుగా విస్తరించనున్నట్లు తెలిపారు. మినీబైపాస్ రోడ్డు అన్నమయ్య సర్కిల్ నుంచి గొలగ మూడి వరకు రూ.8కోట్లు వ్యయంతో నాలుగులైన్ల రోడ్డును నిర్మించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆనం రంగమయూర్ రెడ్డి, మాజీకార్పొరేటర్లు మేకలనరేంద్రరెడ్డి, పిండి సురేష్, కిలారి తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.



నగరఎమ్మెల్యే ముంగమూరు




## వధువు కావలెను — పెళ్లి సంబంధాలు — వరుడు కావలెను

1. 1983 మార్చి 18 జననం. ఎత్తు 5'8". చదువు బి.టెక్(బయోటెక్), యం.టెక్(బయోఇన్‌ఫోమెటిక్స్). వ్యాపారం ఆక్వా. రియల్‌ఎస్టేట్స్, కన్‌స్ట్రక్షన్స్. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. స్వస్థలం ప్రకాశంజిల్లా. ఆస్తివిలువ 20కోట్లు.
2. 1982 డిసెంబర్ 23 జననం. ఎత్తు 5'7". చదువు యం.బి.బి.యస్(కర్నూలు). యం.డి(జనరల్ మెడిసిన్), సిద్ధార్థ మెడికల్ కాలేజ్(విజయవాడ). ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం అనంతపూర్. ఆస్తి విలువ 25కోట్లు.
3. 1985 ఆగష్టు 28 జననం. ఎత్తు 5'10". చదువు బ్యాచులర్‌ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, డిప్లొమా కమర్షియల్‌కుక్కరి(ఆస్ట్రేలియా), డిప్లొమా హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(ఆస్ట్రేలియా). ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం. (సివిల్ కాంట్రాక్ట్సు), డీలర్ ఎక్స్‌ప్లోజివ్స్, స్వస్థలం చిత్తూరుజిల్లా ఆస్తి విలువ 25కోట్లు.
4. 1983 మే 12 జననం. ఎత్తు 5'5". చదువు యం.బి.బి.యస్(రామయ్య మెడికల్ కాలేజి, బెంగుళూరు). యం.డి(రేడియాలజీ) నారాయణ మెడికల్ కాలేజ్, నెల్లూరు. ఉద్యోగం సెంట్‌జాన్స్ హాస్పిటల్ (బెంగుళూరు). ఆస్తివిలువ 25కోట్లు. స్వస్థలం బెంగుళూరు. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం.
5. 1984 ఏప్రిల్ 5 జననం. ఎత్తు 5'9". చదువు బి.ఇ(ఎలక్ట్రానిక్స్) బెంగుళూరు, యం.యస్(ఎలక్ట్రానిక్స్) అమెరికా. ఉద్యోగం క్వాల్‌కాం-శాండిగో(కాలిఫోర్నియా). జీతం 100కె డాలర్లు సంవత్సరానికి. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుతనివాసం బెంగుళూరు. ఆస్తి వాటా 20కోట్లు.
6. 1988 జూలై 22 జననం. ఎత్తు 5'3". చదువు బి.ఇ(ఇన్ఫర్మేషన్‌సైన్స్). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. బెంగుళూరు. ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం చిత్తూరుజిల్లా, ప్రస్తుత నివాసం బెంగుళూరు. ఆస్తివాటా 2కోట్లు.
7. 1985 ఫిబ్రవరి 5 జననం. ఎత్తు 5'4". చదువు యం.బి.బి.యస్. ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా. ఆస్తివాటా 4కోట్లు.
8. 1985 అక్టోబరు 27 జననం. ఎత్తు 5'6". చదువు బి.ఇ మద్రాసు. యం.యస్సీ(లండన్). ఉద్యోగం బొంబాయి. జీతం నెలకు 70,000/-. ఆస్తివాటా 2కోట్లు. ఉన్నతమైన రెడ్డివ్యాపార కుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
9. 1987 డిసెంబరు 24 జననం. ఎత్తు 5'31/2". చదువు బి.టెక్(ఐఐటీ), చెన్నై, యం.బి.ఎ(ఐఐయమ్) బెంగుళూరు. ప్రస్తుతనివాసం విశాఖపట్నం ఆస్తివాటా 5కోట్లు. ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం.
10. 1981 ఆగష్టు 21 జననం. ఎత్తు 5'3". చదువు బి.టెక్(కంప్యూటర్స్), (జెయన్‌టియు), హైదరాబాద్. ఉద్యోగం ఐ.ఆర్.యస్(ఐటి). ట్రైయినింగ్. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్తివాటా 1కోటి. స్వస్థలం కడపజిల్లా.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.
98480 34522
94406 39460.
ఫోన్స్‌బాక్స్ నెం.4. C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక. ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

# మూ'వీ'క్షణం







## ఇంకా ప్రేమలో పడలేదు

ఒక తమిళ అగ్రనటుడితో తాను ప్రేమాయణం సాగిస్తున్నానని వచ్చిన వార్తలను హన్సిక కొట్టిపడేస్తుంది. నేను ఇంతవరకు ఎవ్వరితోనూ ప్రేమలో పడ లేదని, ఇలాంటి పుకార్లు మీడియా సృష్టే నని ఈ అమ్మడు మండిపడుతుంది. ఒక వేళ ఎవరినైనా ప్రేమిస్తే కుటుంబసభ్యు లతో పాటు మీడియా వారికి కూడా చెబుతానంటుంది ఈ చిన్నది.



## ఎన్నారైలకు బంపర్ఆఫర్

ప్రకాష్‌రాజ్ ఎన్ఆర్ఐలకు ఓ బంపర్ ఆఫర్ ఇచ్చారు. ఆయన తాజాగా నిర్మిం చిన 'గౌరవం' సినిమాను ఎన్ఆర్ఐలు కేవలం 5యుయస్ డాలర్లు చెల్లించి హైక్వాలిటీతో ఆన్‌లైన్‌లో ఈ సినిమాను చూడొచ్చు. ఈ ఆఫర్ ఒక్క ఇండియా, యుయస్‌కు తప్ప మిగతా అన్ని దేశాలకు వర్తిస్తుంది. మే1లోపు రిజిష్టర్ చేసుకుని సినిమాను చూసినవాళ్ళు బోనస్‌గా ధోనిని కూడా కలవచ్చని ప్రకాష్‌రాజ్ ఆఫరిచ్చాడు.




## బీభత్సంగా 'కాళీచరణ్'

ప్రవీణ్‌శ్రీ సరికొత్త సినిమా 'కాళీచరణ్' ఇప్పుడు మార్కెట్‌లో సంచలనం సృష్టి స్తుంది. ఈ సినిమా ట్రైలర్ విడుదలైన నాటి నుండి తన మార్కు సీన్‌లతో సినిమా లవర్స్‌కు రక్తచరిత్రను గుర్తుకు తెస్తుంది. ఈ సినిమా ఒక బీభత్సమైన ఎమోషనల్ డ్రామా రీతిలో సాగుతుంది. అగ్రదర్శకు లైన ఆర్.జి.వి., వంశీ పైడిపల్లిలు ఈ ట్రైలర్ చూసి దర్శకుడిని అభినందించారు.



## నిత్యప్రేమికుడు

ఏ నిముషాన 'ప్రేమికుడు' సినిమాలో ప్రభుదేవాను హీరోగా పెట్టి తీసారోగాని నిజజీవితంలో కూడా ఆయన నిత్యప్రేమి కుడుగా మారిపోయాడు. ఒకప్పుడు నగ్మా, తర్వాత సిమ్రాన్, మొన్న నయనతార... ఇలా ప్రభుదేవా లిస్టు బాగానే వుంది. నయనతో ఆయన ప్రేమాయణం పెళ్ళి పీటలు, పాతభార్యతో విడాకులదాకా వచ్చి ఆగిపోయింది. తాజాగా ఆయన కేరళ బ్యూటీ అసిన్‌తో ప్రేమలో పడ్డట్లు టాక్.





## హిందీలోనూ హిట్ కొడతా

తెలుగు, తమిళం... ఇలా రెండు రంగాలలో హిట్‌లు కొట్టింది తమన్నా. కాగా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన 'హిమ్మత్ వాలా' మాత్రం ఆమెకు అనుకున్నంత పేరును తేలేదు. కాని తమన్నా మాత్రం హిందీలో కూడా హిట్ కొట్టాలనే పట్టుద లతో వుంది. అపజయాలతోనే విజయా లకు బాటలు వేసుకుంటానని, ఈ అప జయంతో కృంగిపోనని అంటుంది.

# గూడూరు డివిజన్ వార్తలు

## గ్రీవెన్స్‌డేకు భూసమస్యలపై అర్జీలు



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ నివాస్

గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డేకు భూసమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. గూడూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల నుంచి వచ్చిన అర్జీలు భూసమస్యలపై సబ్‌కలెక్టర్ అందజేసారు. చిల్లకూరు మండలం కలవకొండకు చెందిన దొంతి శీనయ్యకు ప్రభుత్వం 1977లో గ్రామంలోని సర్వే నెంబరు 181-5లో 65సెంట్లు, 182-5లో 1.22 ఎకరాలు, 182-8 సర్వేనెంబరులో 1.21సెంట్లు మంజూరు చేసింది. అప్పటి నుంచి సాగు చేసుకొంటున్న భూమిని ఎస్‌బిక్యూ స్టీల్స్ వారు సేకరించారు. అయితే ఇప్పటి వరకు పరిహారం అందజేయలేదని శీనయ్య సబ్ కలెక్టర్ నివాస్‌కు విన్నవించుకొన్నాడు.


## అదుపులేని ఆటోలు

గూడూరులో ఆటోలను క్రమబద్ధీకరించకపోవడంతో ఆటోవాలాల జోరు పెరిగి రోడ్డుకు అడ్డదిడ్డంగా ఆటోలను నిలిపివేయడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడు తున్నారు. పట్టణం ప్రధాన కూడలి అయిన ఎన్టీఆర్ కాంప్లెక్స్, టవర్‌క్లాక్‌సెంటర్ వద్ద ఆటోలను రోడ్డుపైనే నిలిపివేయడంతో ట్రాఫిక్ స్థంభించిపోతుంది. అటు వ్యాపార స్థులకు అడ్డంగా ఆటోలను పెట్టి ప్యాసెం జర్లకోసం వేచి ఉండడం వల్ల రోడ్డుపై వెళ్లే వాహనాలకు ఇబ్బందిగా తయా రైంది. వ్యాపారులు పలుమార్లు వారికి విన్నవించినా వారు స్పందించకపోవడంతో చేసేదిలేక వ్యాపారులు నష్టబాటు ధోరణితో పోతున్నామని, అయినా ఆటోలు సంఖ్య మాత్రం పెరిగిపోయి చిన్న ఆటో స్టాండ్‌లా మారిందని వ్యాపారులు బాధను వ్యక్తంచేసారు. గూడూరు సిఐ సత్యనారా యణ ఆటోల జోరును తగ్గించి వారిని స్టాండ్‌లో ఆటోలను నిలిపే విధంగా ఏర్పా టుచేస్తే అందరికీ బాగుంటుందని వ్యాపా రులు, వాహనదారులు కోరుతున్నారు.

### రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్
## నూతన కార్యవర్గం ఎన్నిక

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడిగా చెన్నయ్య, అసోసియేట్ అధ్యక్షుడుగా రవికుమార్, ఉపాధ్యక్షులుగా రవీంద్ర నాథ్, మునికిరణ్, గీతావాణి, కార్యదర్శిగా రవికుమార్ సంయుక్త కార్యదర్శిగా మస్తా నయ్య, పీఏ ఖాన్, మహేష్‌కుమార్, ట్రెజ రర్‌గా ఏవీ సుబ్బారావు, ఈసి జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ప్రసాద్, జయచంద్ర, శివా నందరెడ్డి, నిరంజన్ విష్ణు ఎన్నికైనట్లు ఎన్ని కల అధికారి సతీష్‌కుమార్ తెలిపారు.

### రోటరీ మెయిన్ క్లబ్ అధ్యక్షుడిగా
## మయూరిశ్యామ్



గూడూరు రోటరీక్లబ్ మెయిన్ క్లబ్ అధ్యక్షుడిగా మయూరిశ్యామ్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కార్యదర్శిగా చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్య క్షుడిగా దశరథరామిరెడ్డి, జాయింట్ సెక్రెటరీగా బంది ప్రభాకరరెడ్డి బులిటన్ ఎడిటర్‌గా మునిరాజా, కోశాధికారిగా బత్తిన హనుమంతరావు, క్లబ్ అడ్మినిస్ట్రేషన్ ఛైర్మెన్ అశోక్, టీఆర్ఎఫ్ ఛైర్మెన్‌గా కె.ముని గిరీష్ పిఆర్వోగా రత్నం కమ్యూనిటీ సర్వీ సెస్ ఛైర్మెన్‌గా రమణబాబు, మెంబర్‌షిప్ డెవలప్‌మెంట్ ఛైర్మెన్‌గా నాగేంద్రప్రసాద్ ఎన్నికైనట్లు చెప్పారు. ఎన్నికైన కార్యవర్గానికి ఈ నెల 20, 21న బెంగుళూరులోని చిత్ర దుర్గలో జరిగిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, దశరథరామిరెడ్డి, సేవా కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

## త్వరలో రచ్చబండ

### సబ్ కలెక్టర్ నివాస్ వెల్లడి

ప్రభుత్వం త్వరలో రచ్చబండ కార్య క్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపడు తుందని సబ్‌కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆ మేరకు వివరాలను వెల్లడించారు. రేషన్ కార్డులులేని అర్హులైన వారు ఆయా తహ శీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకొన్న లబ్ధిదారులు తమ పేరు కంప్యూటర్‌లో నమోదై ఉందా? లేదా? అన్ని విషయాలను పరిశీలించుకోవాలని అన్నారు. పేర్లు నమోదు కాకపోతే తిరిగి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## అభివృద్ధి.. మాతోనే సాధ్యం



గూడూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పనబాక కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ముత్యాలపాడు ఎ.ఎం.సీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డిల సహకారంతో నియోజకవర్గంలో కొన్ని కోట్ల రూపాయల అభివృద్ధి పనులు మంజూరైనట్లు చెప్పారు. ప్రతి పక్షాలు ఒట్టి మాటలకే పరిమితం అవుతున్నాయని అభివృద్ధి తాము చేతల్లో చూపిస్తున్నామని అన్నారు.

### నూతన గాయకులకు...
## పాతపాటలే పుస్తకాలు



నూతన గాయకులకు పాతపాటలే పుస్తకాలతో సమానమని గాయని గీతామాధురి అన్నారు. గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో సోమవారం రాత్రి జరిగిన ఓ ఈవెంట్ షోకు వచ్చిన ఆమె యాంకర్ చిత్రలేఖతో కలసి కాసేపు "లాయర్"తో మాట్లాడారు. పాటలు ఎప్పుడికప్పుడు కొత్తగా అనిపిస్తాయని, పాతపాటలే కొత్త గాయకులకు ఎన్నో మెలకువలు నేర్పుతాయని తన ఉద్దేశమన్నారు. తన స్వస్థలం పాలకొల్లని, తండ్రి ప్రభాకర్‌శాస్త్రి, తల్లి లక్ష్మి అని వివరించారు. తాను ఆరోరా డిగ్రీ కళాశాలలో బి.కాం పూర్తిచేసినట్లు, చిన్నతనం నుండే పాటలంటే ఇష్టమని అన్నారు. మొదట రామాచారి సంగీత నిర్వహణలో ప్రేమలేఖ రాసా సినిమా అవకాశం లభించిందని, అనంతరం ఖతర్నాక్, చిరుత, ఒక్కడున్నాడు, నచ్చావులే, గోలీమార్ చిత్రాలతో పాటు తాజాగా మిర్చి, బాద్‌షా, షాడో తదితర సినిమా పాటలు పాడానని వెల్లడించారు. గాయకులలో బాలసుబ్రహ్మణ్యం, చిత్ర, సునీత అంటే ఇష్టమని తెలిపారు.

## శ్రీరాముల వారి పల్లకీసేవ

గూడూరు రాజావీధిలోని రామాలయంనందు శ్రీరామనవమి 24వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఉదయం 8గంటలకు స్వామి వారికి అభిషేకం, రాత్రి 8గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక అలంకారం చేసి పల్లకీసేవను నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విచిత్ర వేషధారణ పోటీలను నిర్వహించారు. ఈ ఉత్సవదాతలుగా పి.గోపీనాథ్‌రెడ్డి పద్మాగ్లాస్, సొల్లేటి సుబ్బరాములు, సొల్లేటి జ్యూయలర్స్, నిఖిత జ్యూయలరీ తాళంకి సుబ్బారావు తాళంకి సురేష్‌లు వ్యవహరించారు.

PDF Compressor Free Version



### అంగరంగ వైభవంగా...

## ఆంజనేయుని రథోత్సవం


రథాన్ని లాగుతున్న ముంగమూరు

నెల్లూరు నగరం సంతపేటలో వేంచేసియున్న శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం శ్రీస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత ఆలయ ప్రధానార్చకులు గోపిస్వామి దేవేరులను పవిత్ర, పుష్పాలతో, వజ్రాభరణాలతో అందంగాఅలంకరించి విశేష పూజలు, గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను నిర్వహించి ఉత్సవ విగ్రహాలను రథంపై ప్రతిష్టించారు. అశేష భక్తుల జైశ్రీరాం నామస్మరణతో, నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పచ్చజెండా వూపి రథాన్ని ప్రారంభించారు. అధికసంఖ్యలో భక్తులు రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రథం తొలుత సంతపేట ఆంజనేయస్వామి వారివీధి నుంచి బయలుదేరి ములుముడి బస్టాండు మీదుగా చిన్నబజారు, మండపాలవీధి, కాపువీధి, ట్రంకురోడ్డు మీదుగా సంతపేట దేవస్థానానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో 'లాయర్' సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి రామకృష్ణ, కప్పిర శ్రీనివాసులు, మాజీ కార్పొరేటర్ సుధీర్, సంపతి హనుమంతరావు, భక్తులు పాల్గొన్నారు.

## చైల్డ్ ఆశ్రమంలో పుస్తకాల పంపిణీ



ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా 23వతేదీన గొల్లపాళెం గ్రామంలోని చైల్డ్ ఆశ్రమ పాఠశాలనందు బాలల వ్యక్తిత్వ వికాసమునకు ఉపయోగపడు పుస్తకాలను జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ నెల్లూరు అధ్యక్షులు తవ్వా శ్రీనివాసులు, జేసీరేట్ వింగ్‌చైర్‌పర్సన్ యోగవల్లి ఆశ్రమ నిర్వాహకులు శరత్‌బాబు అందజేయటం జరిగిందని జేసీరేట్‌వింగ్ కార్యదర్శి టి.సునీతలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్ట్‌జేసీరేట్ చైర్‌పర్సన్ సుధారాణి, పలువురు జేసీస్ పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ అరెస్ట్ అన్యాయం

### నల్లబ్యాడ్జీలతో సబ్‌రిజిస్ట్రార్ల నిరసన




నల్లబ్యాడ్జీలతో నెల్లూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలోని సబ్‌రిజిస్ట్రార్లు, సిబ్బంది బుధవారం విధులు నిర్వహించారు. ఈనెల 15వతేదీన ప్రకాశంజిల్లా సంతనూతలపాడు సబ్‌రిజిస్ట్రార్ పర్వీన్ బాబి అరెస్టును నిర్వహిస్తూ సబ్‌రిజిస్ట్రార్లు, సిబ్బంది గత శనివారం నుంచి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సబ్‌రిజిస్ట్రార్ల అసోసియేషన్ అధ్యక్షుడు నెల్లూరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2, వై.కె.నందకిషోర్ మాట్లాడుతూ సెంట్రల్ అసోసియేషన్ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్నామని, తమ అసోసియేషన్ ఆదివారం హైదరాబాద్‌లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసిందని, సదరు సమావేశంలో తీర్మానించిన డిమాండ్లు నెరవేరే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామన్నారు. సంతనూతలపాడు సబ్‌రిజిస్ట్రార్ పర్వీన్‌బాబిని అక్రమంగా అరెస్టు చేసారని, వృత్తిధర్మంతో, అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న సబ్‌రిజిస్ట్రార్లపై రిజిస్ట్రేషన్ల అంశంపై అక్రమంగా అరెస్టులు చేయడం దారుణమన్నారు. రిజిస్ట్రేషన్ దస్తావేజులను క్షుణ్ణంగా పరిశీలించి రిజిస్ట్రేషన్లు చేయడం జరుగుతుందని ఏలాంటి అవకతవకలకు సబ్‌రిజిస్ట్రార్‌లు పాల్పడరన్నారు. సబ్‌రిజిస్ట్రార్లపై అక్రమకేసులు బనాయించి అరెస్టులు చేస్తే సహించబోమన్నారు. రిజిస్ట్రేషన్ల సమయంలో జరిగే అక్రమాలలో సబ్‌రిజిస్ట్రార్లను బాధ్యుల్ని చేయడం అన్యాయమన్నారు. నెల్లూరు జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1 విజయరాణి మాట్లాడుతూ ఒక మహిళ అయిన సబ్‌రిజిస్ట్రార్‌ను అన్యాయంగా అరెస్టు చేసి బెయిల్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిబ్బంది వినయ్‌గోపాల్, హనుమంతరావు, మల్లిఖార్జున, రమణయ్య, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

### 'అభయహస్తం' కాదది...

## 'భస్మాసుర హస్తం'


మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న అనిల్‌కుమార్ యాదవ్

వైయస్సార్సీపీ నెల్లూరు నగర సమన్వయకర్త డా॥పి.అనిల్‌కుమార్‌యాదవ్ చేపట్టిన ప్రజాదీవెన కార్యక్రమంలో భాగంగా ఈనెల 24న నెల్లూరు 5వడివిజన్ పరిధిలో గడపగడపకు వెళ్ళి వైయస్సార్సీపీ విధివిధానాలను తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక చర్యలను తూర్పారబట్టారు. 185రూ॥లకే నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని ప్రచార ఆర్భాటాలు చేస్తుంది తప్ప ఆ వస్తువుల నాణ్యతను చూడడంలేదని, అవి నాసిరకంగా వుంటున్నాయని పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభయహస్తం కార్యక్రమం పేదప్రజల పాలిట భస్మాసుర హస్తంగా తయారయిందన్నారు. పేద ప్రజల పాలిట సంజీవనిలాంటి ఆరోగ్యశ్రీ పథకాన్ని దివంగత మహానేత ప్రవేశ పెడితే దేశంలోని అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని చేపడుతుంటే మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆరోగ్యశ్రీ నుండి 133 వ్యాధులకు సేవలను తొలగించడం ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేకతకు తార్కాణమని పేర్కొన్నారు. అటువంటి ప్రభుత్వానికి, దానికి కొమ్ముకాస్తున్న తెలుగుదేశంపార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పి వైయస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకువస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు ముక్కాల ద్వారకానాథ్, పెడివర్ల శివకుమార్‌యాదవ్, కో-ఆర్డినేటర్ నాగరాజు, సుబ్రహ్మణ్యం, శ్రీను, సంక్రాంతి కల్యాణ్, ధార్ల వెంకటేశ్వర్లు, లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లెక్కల వెంకారెడ్డి సిద్ధిక్, ముప్పసాని శ్రీనివాసులు, మాదాల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో 'గాయత్రి' హవా


అలీషా


సునయన

2013 జూనియర్ ఇంటర్ ఫలితాలలో నెల్లూరులోని 'శ్రీ గాయత్రి' జూనియర్ కాలేజీ విద్యార్థులు తమ హవాను చాటారు. ఫస్ట్‌బ్యాచ్‌తోనే శ్రీ గాయత్రి జూనియర్ కాలేజీ జిల్లా ఫస్ట్ మరియు రాష్ట్రస్థాయిలో 3వ స్థానంలో మార్కులు సాధించడం విశేషం. ఎంపిసిలో 470 మార్కులకు గాను ఎస్.కె.అలీషా 465 మార్కులు, వి.కావ్యాచౌదరి 462, కె.తేజశ్వి 462, ఎం.రిషిత ప్రియ 461, పి.లక్ష్మీగౌతమి 461, సి.హెచ్.రాజేష్ 460, కె.నాగదీప్తి 459, ఏ.సునీల 459, సి.తేజశ్విని 458, ఎస్.షణ్ముఖదేవ్ 458మార్కులు సాధించారు. అలాగే బైపీసీ విభాగంలో 440మార్కులకు గాను ఏ.సునయన 432, జి.రాకేష్ 431, కె.యశ్వంత్ శ్రీనివాస్ 430, ఎన్.ధర్మతేజ 426, కె.వి.సుస్మిత 425, కె.దివ్యచైతన్య 424 మార్కులతో తమ విద్యాసంస్థ పేరును నిలబెట్టారు. వీరికే గాక ఈ కాలేజీ నుండి ప్రతి ఒక్కరికి 400మార్కులకు పైగా రావడం విశేషం. వీరిని కాలేజీ ఛైర్మెన్ పి.వి.ఆర్.కె.మూర్తి, ఏజీఎం పి.నరసయ్యనాయుడు, జోనల్ డైరెక్టర్ ఎం.రఘుపతినాయుడులు అభినందించారు.

## రోటరీ ఒకేషనల్ అవార్డ్స్

నెల్లూరు రోటరీక్లబ్ వారు ప్రతి సంవత్సరం ప్రభుత్వశాఖల్లో పనిచేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు 2012-13 సంవత్సరానికి గాను ఒకేషనల్ అవార్డ్సును అందజేసి, నగదు, ప్రశంసాపత్రము, మెమొంటోలతో సత్కరించారు. ఉత్తమ ఆర్‌టీసి డ్రైవర్‌గా పి.శీనయ్య, ఉత్తమ పోస్టు మ్యాన్‌గా ఎం.శ్రీనివాసులు, ఉత్తమ ట్రాఫిక్‌కానిస్టేబుల్‌గా ఎస్.సుందరరామిరెడ్డి, ఉత్తమ 108ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా పి.కృష్ణయ్య, ఉత్తమ ప్రసూతి వైద్యశాల నర్స్‌గా వయోల ఎవాంజిలియన్, ఉత్తమ పురపాలక డ్రైనేజి వర్కర్‌గా ఎం.రాజేష్ అవార్డులందుకున్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కె.మధుసూదనరావు కె.వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### సాయిదర్బార్‌లో వైభవంగా...

## శ్రీరామనవమి మహోత్సవాలు



నెల్లూరు బాలాజీనగర్ ఎక్స్‌టెన్షన్ పద్మావతినగర్‌లో వెలసియున్న శ్రీసాయి దర్బార్ అద్దాల మందిరం నందు షిరిడిసాయి బాబా ఉగాది శ్రీరామనవమి మహోత్సవాలు ఈనెల 11 నుండి 20వతేది వరకు వైభవంగా జరిగాయి. 11వతేది నుండి 18వతేది వరకు అఖండ శ్రీసాయినామ సంకీర్తన సప్తాహమహాయజ్ఞాములు "ఓం సాయి శ్రీసాయి జయజయసాయి" అఖండ శ్రీసాయినామ సంకీర్తన మహాయజ్ఞం వీనులవిందుగా సాగింది. 19వతేది శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామచంద్రుల వారి కల్యాణమహోత్సవం కనులవిందుగా జరిగింది. షిరిడి హారతులు, అన్నసంతర్పణ తదితర కార్యక్రమాలు జరిగాయి. శిరిడి సాంప్రదాయం ప్రకారం శ్రీసాయినాథుని నగరోత్సవము, ముస్లింల గంధమహోత్సవం(ఉరుసు), జెండా ఉత్సవము ఒకే ఊరేగింపుగా మేళతాళాలతో, తప్పెట్లతో, తెనాలి బ్యాండు మేళాలతో, ముస్లీం ఫకీర్ల నృత్యగానాలతో, మంగళవాయిద్యాలతో, పురవీధుల్లో అత్యంత వైభవంగా జరిగింది. 20వతేది ఉదయం నుండి సాయంత్రం వరకు "శ్రీసాయి సచ్చరిత్రము" పూర్తి గ్రంథము అఖండ పారాయణం జరిగింది. ఈ కార్యక్రమాలను శ్రీసాయిదర్బార్ ట్రస్టు, సత్సంగ సేవాదళ్ సభ్యులు పర్యవేక్షించారు. భక్తులు వేలాదిగా పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

### కాలధర్మం

## తుమ్మల సుదర్శనమ్మ



మాగుంటలేఅవుట్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా నెల్లూరీయులందరికీ సుపరిచితుడై మాగుంట లే అవుట్ కృష్ణారెడ్డిగా పేరుబడ్డ తుమ్మల కృష్ణారెడ్డి సతీమణి, హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు తుమ్మల సుదర్శనమ్మ (77) ఈ నెల 17వ తేదీన కనుమూసారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బిఏ బిఇడి చేసి టీచర్‌గా ఎంతోమంది జీవితాలను తీర్చిదిద్దిన సుదర్శనమ్మ తన భర్త కృష్ణారెడ్డి నిర్వహించిన ఎన్నో సేవాకార్యక్రమాలకు తోడునీడగా నిలిచారు. హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా ప్రతినెల ఎందరో పేదలకు పింఛన్‌లు ఇవ్వడంలో ఆమె కృషి వుంది. గతంలో తామేకాక అమెరికాలో వుంటున్న తమ కుమార్తె రూతు(లక్ష్మీ) ద్వారా చిన్నారి హార్ట్ ఫౌండేషన్‌తో పాటు మరెన్నో సేవా సంస్థలకు విరాళాలిప్పించారు. జీవిత ప్రయాణంలో తోడుగా తన వెన్నంటి నీడగా నిలిచిన సహచర భాగస్వామిని కోల్పోయిన కృష్ణారెడ్డికి సానుభూతి తెలుపుతూ సుదర్శనమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తోంది 'లాయర్'.

లాయర్ | 12 | నెల్లూరు, శుక్రవారం, ఏప్రిల్ 26, 2013

# ఎన్నికలు ఎప్పుడొచ్చినా సై



సమావేశంలో ప్రసంగిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

గడపగడపకూ వైయస్సార్‌సీపీ కార్యక్రమంలో భాగంగా ఈనెల 23న వైయస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరు మండలంలోని గోపసముద్రం, దిగువమర్రాపల్లిలలో దీవెనయాత్ర చేసారు. ఆయనతో పాటు వైయస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుదు పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి, తోటపల్లి గూడూరు కన్వీనర్లు పెదమల్లు రమణారెడ్డి, పద్మనాభరెడ్డి, దానరి భాస్కర్‌గౌడ్, మర్రిపల్లి నాయకులు గోగుల గోపాలయ్య, ముక్కు వెంకటేశ్వర్లు గౌడ్, ముక్కు రామకృష్ణ, రాచకొండ శ్రీనివాసులు, మోహన్ యాదవ్, వెంపులూరు శ్రీనివాసులుగౌడ్, తాళ్ళూరు పెంచలయ్య, కోసూరు సుబ్రహ్మణ్యం, రావుల అంకోజీ, పొదలకూరు నాయకులు మద్దిరెడ్డి రమణారెడ్డి, వాకాటి శ్రీనివాసులు రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుండా కాంగ్రెస్ ఏడాదిన్నర కాలంగా వాయిదా వేస్తోందని, ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయితీలో పారిశుధ్యం పడకేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూల పవనాలు లేవని అందుకనే 2011 జనాభా లెక్కలు తెరమీదకు తెచ్చి వాయిదావేసే ఆలోచనలో వున్నట్టు తెలుస్తోందన్నారు. వైయస్సార్‌సీపీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా వుందన్నారు. జగన్మోహన్‌రెడ్డిని కుటుంబసభ్యులకు దూరం చేసిన ఘనత చంద్రబాబుదేనని, కుయుక్తులతో తనపై వున్న కేసులు బయటకు రానీయకుండా కాంగ్రెస్‌తో జతకట్టిన ఘనుడు కూడా బాబేనని పేర్కొన్నారు. దివంగత మహానేత వైయస్ రైతులపై ప్రేమతో వ్యవసాయానికి పెద్దపీట వేస్తే, వ్యవసాయంపై ఏమాత్రం అవగాహనలేని నేటి సియం పాలనలో రైతులు నానా కష్టాలు పడుతున్నారన్నారు.

# బీద మస్తాన్‌కు పెద్దపదవి



రాష్ట్ర శాసనసభ ఉపాధి కల్పన స్థాయీసంఘం ఛైర్మన్‌గా కావలి శాసనసభ్యులు బీద మస్తాన్‌రావును నియమిస్తూ స్పీకర్ నాదెండ్ల మనోహర్ ఉత్తర్వులు జారీ చేసారు. బుధవారం మొత్తం 12 స్థాయీసంఘాలకు ఛైర్మన్‌లను నియమించారు. వీటికి ఛైర్మన్‌లుగా 8మంది ఎమ్మెల్యేలను, నలుగురు ఎమ్మెల్సీలను నియమించారు. 9 స్థాయీసంఘాలకు అధికార పార్టీ వారే ఛైర్మన్‌లుగా వుండగా 3 సంఘాలకు ప్రతిపక్షసభ్యులను ఛైర్మన్‌లుగా నియమించడం జరిగింది. ఒక్కో కమిటీలో 31మందిని సభ్యులుగా నియమించారు. దీంతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా ఏదో ఒక కమిటీలో సభ్యులుగా వున్నట్లే. తెలుగుదేశంలో వున్నప్పటికి బీద మస్తాన్‌రావు రాజకీయ వివాదాలకు దూరంగా వుంటాడు. 2001లో బోగోలు జడ్పీటీసీగా ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చాడు. 2004లో అల్లూరు నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 2009లో కావలి అసెంబ్లీ నుండి తెలుగుదేశం అభ్యర్థిగా గెలుపొందారు. ఎమ్మెల్యేగా కావలి నియోజకవర్గ అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు తెచ్చారు. మాస్ నాయకుడు కాదు... క్లాస్ లీడర్. రాజకీయాలను కూడా కార్పొరేట్ లెవల్లో చేయాలంటాడు. రాజకీయాలనేవి ఎన్నికల వరకే పరిమితం కావాలని, మిగతా సమయాన్నంతా అన్ని పక్షాల వారు ప్రజాసమస్యల పరిష్కారానికి వెచ్చించాలనేది ఆయన పాలసీ. గౌరవప్రదమైన స్థాయీసంఘ పదవిని చేపట్టినందుకు బీదకు 'లాయర్' అభినందనలు.

# నూతన అధ్యక్షులకు అవగాహన సదస్సు



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న ధనుంజయరెడ్డి

నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్ జూబ్లీ హాల్లో ఈనెల 22న నాబార్డు, ఆప్కాబ్ సంయుక్త ఆధ్వర్యంలో కొత్తగా ఎంపికైన సొసైటీ అధ్యక్షులకు సహకార రంగంపై అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పాల్గొని మాట్లాడుతూ సొసైటీల బలోపేతానికి, రైతుల సంక్షేమానికి సొసైటీ అధ్యక్షులు పాటుపడాలన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి రాయితీ పొందేలా కృషిచేయాలని పేర్కొన్నారు. ఎన్.డి.సి.సి మాజీ ఛైర్మన్ వేమారెడ్డి శ్యాంసుందరరెడ్డి మాట్లాడుతూ రైతులకు సంపూర్ణ సేవలు అందించడంలో సహకార రంగం నూతన అధ్యక్షులు చురుకుగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహకారశాఖ అధికారి సుబ్బారావు, సెంట్రల్ బ్యాంక్ సి.ఇ.ఓ రమణారెడ్డి, ఎన్‌డిసిసి ఉపాధ్యక్షుడు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొనగా సహకార సంఘం, సహకార రంగం చట్టాలపై నాబార్డు ఏజియం ప్రియంవద ఎల్‌సిడి ద్వారా అవగాహన కల్పించారు.

# ఇంటర్‌లో బాలికలే టాప్



ఇంటర్మీడియట్ బోర్డు ఆదివారం విడుదల చేసిన ప్రథమ సంవత్సరం ఇంటర్ పరీక్షా ఫలితాల్లో బాలికలదే పై చేయి అయింది. మూడు గ్రూపుల్లో ప్రథమస్థానాలు వీరివే. జిల్లాలో 64శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో నెల్లూరు జిల్లా ఈసారి మూడవస్థానంలో నిలిచింది. ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 27,959మంది విద్యార్థులు హాజరుకాగా వీరిలో 17,873 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. గతఏడాది ప్రభుత్వ కళాశాలల్లో 45శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 52.1శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలోని మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల వందశాతం ఫలితాలు సాధించగా, అతితక్కువ శాతం ఉత్తీర్ణత శాతం సాధించిన కళాశాలల్లో సూళ్ళూరుపేట ప్రభుత్వ కళాశాల 20శాతం, ఆత్మకూరు 22శాతం, నెల్లూరు కేవీసీ 33శాతం ఉత్తీర్ణతను సాధించాయి. ఇదిలా వుంటే ఉత్తమ ఫలితాల్లో 96శాతం ఉత్తీర్ణతలో దామరమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల రెండవ స్థానంలోను, 94శాతం ఉత్తీర్ణతలో టిపి గూడూరు మూడవస్థానం నిలబెట్టుకున్నాయి. ఇంటర్ ప్రథమసంవత్సరం ఫలితాల్లో ఎంపిసీ, బైపిసి, ఎంఇసీ గ్రూపుల్లో జిల్లాస్థాయిలో ప్రథమస్థానాన్ని ముగ్గురు బాలికలు సొంతం చేసుకున్నారు.






Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY.**